స్టాండింగ్ కమిటీ నామినేషన్ల పరిశీలన పూర్తి

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి):
జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ కోసం అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన బుధవారం ముగిసింది. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలకు 21 మంది నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దాఖలైన నామినేషన్లను ఏడీసీ ఎస్.ఎస్.వర్మ, కార్యదర్శి బి.వెంకటరమణ బుధవారం పరిశీలించారు. నామినేషన్లు అన్నీ సక్రమంగా ఉండడంతో వాటిని ఆమోదిస్తున్నట్టు ప్రకటించారు. నామినేషన్ల ఉపసంహరణకు శుక్రవారం వరకూ గడువు ఉంది. వచ్చే నెల ఆరున ఎన్నిక జరగనున్నది.

కానరాని శతాబ్ది సందడి

వందో వసంతంలోకి ఏయూ

- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకూ వేడుకలు నిర్వహిస్తామంటూ అధికారుల ప్రకటన
- వందేళ్ల వేడుకలకు గుర్తుగా ఏదైనా నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రణాళిక
- కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయం



- మూడు నెలల క్రితం ఉత్సవాలు ప్రారంభం
- ఆ తరువాత ఆ ఊసే లేదు
- దేశ, విదేశాల్లో కీలక స్థానాల్లో పూర్వ విదార్థులు
- వారిని సమన్వయపరిచే యంత్రాంగమే లేదు

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి):
ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శతాబ్ది ఉత్సవాల సందడేమీ కనిపించడం లేదు. దేశంలోని పురాతన విద్యా సంస్థల్లో ఒకటైన ఏయూ వందో ఏడాదిలోకి ప్రవేశించడంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకూ వేడుకలను నిర్వహిస్తామంటూ అధికారులు ప్రకటించారు. వేడుకలకు గుర్తుగా ఏదైనా గొప్ప కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఇందుకోసం దాతలు, పూర్వ విద్యార్థుల సహకారాన్ని తీసుకుంటామన్నారు. ఆంధ్ర మెడికల్ కాలేజీలో మాదిరిగా నూతన భవనాన్ని నిర్మిస్తే బాగుంటుందని పలువురు మాజీ వీసీలు సలహా ఇవ్వడంతో, ఆ మేరకు వర్సిటీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అదేవిధంగా వర్సిటీ భవిష్యత్తు అవసరాలకు భారీమొత్తంలో నిధులు సేకరించి కార్పస్ ఫండ్ ఏర్పాటుచేయాలని భావించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వాల నుంచి ఆర్థిక సాయం ఆశించిన స్థాయిలో లభించే అవకాశాలు ఉండవని, కార్పస్ ఫండ్ ద్వారా వచ్చే వడ్డీతో వర్సిటీ అవసరాలు తీర్చుకోవచ్చునని అధికారులు ఆలోచించారు. నిధులు సమీకరించే ప్రక్రియను వందేళ్ల వేడుకలతోనే ప్రారంభించాలనుకున్నారు. అయితే, ఈ రెండు కీలక నిర్ణయాలకు సంబంధించి ఇప్పటివరకూ ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు. వందేళ్ల వేడుకలు ప్రారంభమై దాదాపు మూడు నెలలు కావస్తోంది. ఇప్పటివరకూ ఎటువంటి పెద్ద కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించలేదు.

బాధ్యత ఎవరిది?

ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు వేలాది మంది ఉన్నారు. అందులో పలువురు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అయితే, వారిని కో-ఆర్డినేట్ చేసుకుంటూ నిధులు సమీకరించే దిశగా వేదికను ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆంధ్ర మెడికల్ కళాశాల అధికారులు వందేళ్ల వేడుకలకు ఏడాది ముందుగానే కమిటీలను ఏర్పాటు చేసుకుని నిధులను సమీకరించుకుని రూ.50 కోట్లతో సువిశాలమైన భవనాన్ని నిర్మించుకున్నారు. ఈ నేపథ్యంలో ఏయూ అధికారులు కూడా ఆ దిశగా ఆలోచించాలని సూచిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సంఘంతో సమన్వయం కరవు

ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం (ఏఏఏ)లో జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు సహా ఎంతోమంది ప్రముఖులు ఉన్నారు. అటువంటి వారి సహాయాన్ని తీసుకుని వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలి. అయితే, ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో పూర్వ విద్యార్థుల సంఘం కూడా ... మిగతా 6వ పేజీలో

మరోసారి భూ సమీకరణ

విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో ల్యాండ్ పూలింగ్

- 1,941.19 ఎకరాలు లక్ష్యం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- వీఎంఆర్‌డీఏకు అప్పగించాలని ఆదేశం
- అసైన్డ్ పట్టా ఉంటే ఎకరానికి 900 గజాలు
- ఆక్రమణదారుడైతే ఎకరానికి 450 గజాలు
- అభివృద్ధి చేసిన భూమి ఇవ్వాలని నిర్ణయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)లో మరోసారి ల్యాండ్ పూలింగ్ (భూ సమీకరణ) చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మూడు జిల్లాల్లో 1,941.19 ఎకరాలు సమీకరించాలని బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖలో 'ఫ్యూచర్ సిటీ' కోసం వీటిని వినియోగిస్తారు. పేదలు, బలహీన వర్గాల గృహ నిర్మాణానికి ఉపయోగిస్తారు.

రాష్ట్ర ప్రభుత్వం అటు అమరావతి, ఇటు విశాఖపట్నంలలో ల్యాండ్ పూలింగ్‌పై దృష్టిపెట్టింది. పేదలకు గతంలో ఇచ్చిన అసైన్డ్ భూములను, ప్రభుత్వ భూములను ఆక్రమించి రైతులు సాగు చేసుకుంటున్న భూములను వెనక్కి తీసుకోవాలని నిర్ణయించింది. భవిష్యత్తులో భూముల అవసరం చాలా ఉన్నందున ముందుగానే వాటిని సమీకరించి పెట్టుకోవాలని అనుకుంటోంది. దీనిపై కలెక్టర్లతో ముందుగానే ... మిగతా 6వ పేజీలో


విశాఖపట్నం జిల్లాలో 1,132.09 ఎకరాలు

- ఆనందపురం మండలం గిడిజాల సర్వే నంబరు 258లో 309.18 ఎకరాలు
- గోరింట సర్వే నంబరు 108లో 198.31 ఎకరాలు
- శొంఠ్యాం సర్వే నంబరు 347/పిలో 251.55 ఎకరాలు
- బీడీ పాలెం సర్వే నంబరు 1లో 122.53 ఎకరాలు
- పద్మనాభం మండలం కొవ్వాడ సర్వే నంబరు 237లో 250.52 ఎకరాలు

ఆడిట్ పేరుతో యూసీడీ దందా

ఒక్కో స్వయం సహాయక సంఘం నుంచి రూ.500 వసూలు

- ఆడిట్‌కు రూ.300 వసూలు చేయాలని మెప్మా ఎండీ ఆదేశం
- అదనంగా రూ.200 తీసుకుంటున్న సిబ్బంది
- జీవీఎంసీ పరిధిలో సుమారు 35 వేల గ్రూపులు
- రూ.70 లక్షల వరకూ కలెక్షన్





(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
జీవీఎంసీలోని అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యూసీడీ) విభాగంలో వసూళ్లరాయుళ్లు రెచ్చిపోతున్నారు. ఆడిట్ పేరుతో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) నుంచి అదనంగా డబ్బులు వసూలుచేస్తున్నారు. ఆడిట్‌కు ప్రతి సంఘం నుంచి రూ.300 వసూలు చేసుకునేందుకు అధికారులు అవకాశం ఇవ్వడంతో అదనంగా మరో రూ.200 చొప్పున వసూలుచేసి వాటాలు పంచుకుంటున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన యూసీడీ ఉన్నతాధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలను ఏర్పాటుచేసింది. పది మంది మహిళలు కలిసి ఒక సంఘంగా ఏర్పడితే ప్రభుత్వపరంగా వివిధ పథకాలను అందజేయడంతోపాటు స్వయం ఉపాధి అవకాశాలను పెంచుకునేందుకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయిస్తుంది. జీవీఎంసీ పరిధిలో సుమారు 35 వేల స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇవన్నీ రాష్ట్రస్థాయిలో మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మునిసిపల్ ఏరియా (మెప్మా) ఆధ్వర్యంలో కార్యకలాపాలను నిర్వహిస్తుంటాయి. జీవీఎంసీ పరిధిలో యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పర్యవేక్షిస్తుంటారు. మహిళ సంఘాలకు బ్యాంకుల నుంచి రుణాలను ఇప్పించడం ప్రారంభించి దశాబ్దాలు గడిచిపోవడంతో ప్రస్తుతం ఒక్కో సంఘం రూ.20 లక్షల వరకు రుణాలు తీసుకునే స్థాయికి చేరుకుంది. సంఘాలు తీసుకున్న రుణాలను ఆ సంఘంలోని సభ్యులు ఏదైనా వ్యాపారం, స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. తాము సంపాదించే ఆదాయంలో ప్రతి నెలా కొంత మొత్తాన్ని రుణం తీర్చేందుకు బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో కొన్ని సంఘాలు తాము బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను దుర్వినియోగం చేయడం, నిధులను పక్కదారి పట్టించడం వంటివి జరగడంతో లావాదేవీలను ఆడిట్ చేయించాలని ... మిగతా 6వ పేజీలో

వీఎంఆర్‌డీఏ భూములపై ఐటీ కంపెనీల కన్ను



రుషికొండలో రెండు భారీ ప్రాజెక్టులకు నగర ప్రాంత అభివృద్ధి సంస్థ ప్రణాళిక

- అందులో ఒకటి... ఈస్ట్ కోస్ట్ హేబిటేట్ సెంటర్
- మరొకటి...'వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాల్టీ ఎరీనా
- ఇప్పటికే ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన విడుదల
- ఆ భూములు తమకు కేటాయించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్న ఐటీ సంస్థలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)కు చెందిన భూములపై ఐటీ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఇటీవల విశాఖకు పెద్ద పెద్ద ఐటీ సంస్థలు క్యూ కడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలకు రుషికొండలో భూములు కేటాయించిన సంగతి తెలిసిందే. ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా పార్క్‌కు 200 ఎకరాలు సిద్ధం చేస్తున్నారు. తాజాగా రాష్ట్ర మంత్రి మండలి ఏఎన్ఎస్ఆర్, తదితర కంపెనీలకు భూములు కేటాయించింది. వీఎంఆర్‌డీఏ ఇప్పటికే అభివృద్ధి చేసిన భూములు ... మిగతా 6వ పేజీలో



లా కాలేజీకి వెళ్లే మార్గంలో పనోరమ హిల్స్ వద్ద వీఎంఆర్‌డీఏ ప్రతిపాదించిన ఈస్ట్ కోస్ట్ హేబిటేట్ సెంటర్ నమూనా ప్లాన్

ఫార్మాసిటీలో వ్యర్థాల గుట్టలు

అనుమతులు లేకుండా టన్నుల కొద్దీ నిల్వ

- పరిసర ప్రాంతాల భూగర్భ జలాలు కలుషితం
- ప్రాజెక్టు నిర్వహణలో నిబంధనలు బేఖాతరు
- గ్రీన్ ట్రైబ్యునల్‌లో ప్రజా సంఘాల కేసు
- ఈ నెలలోనే నాలుగుసార్లు పీసీబీ తనిఖీలు
- వివరణ కోరుతూ నోటీసులు జారీ



అనుమతులు లేకుండా నిల్వ చేసిన వ్యర్థాల గుట్ట

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
పరవాడలో రాంకీ ఫార్మా సిటీ యాజమాన్యం నిబంధనలను ఉల్లంఘించి పారిశ్రామిక వ్యర్థాలను టన్నుల కొద్దీ నిల్వ చేస్తోంది. వాటి నుంచి బయటకు వచ్చే రసాయనాలు పరిసర ప్రాంతాల వ్యవసాయ భూముల్లో చేరి భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయి. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు హెచ్చరించినా యాజమాన్యం ఖాతరు చేయకుండా ప్రజల ప్రాణాలతో ఆటలాడుతోంది.

ఫార్మా సిటీలో వ్యర్థాల నిర్వహణకు 'కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు' నడుపుతున్నారు. పరిశ్రమల నుంచి వ్యర్థాలను సేకరించి, శుద్ధి చేశాక భద్రంగా నిల్వ చేసి, ఆ తరువాత వాటిని అక్కడి నుంచి దూర ప్రాంతాలకు తరలించాలి. ఇందు కోసం 18.07 ఎకరాలను కేటాయించారు. అందులో 9.11 ఎకరాల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ ఫిల్ (వ్యర్థాలు నిల్వ చేయడానికి)కు అనుమతి ఇచ్చింది. మిగిలిన 8.96 ఎకరాలకు యాజమాన్య హక్కుల విషయంలో వివాదాలు ఉండడంతో నోటిఫై చేయలేదు. రెండు దశాబ్దాలు గడిచినా ఆ వివాదం పరిష్కారం కాలేదు. అయినా ఫార్మా సిటీ యాజమాన్యం మొత్తం 18.07 ఎకరాలను వాడుకుంటోంది. అందులో ఇప్పటివరకూ 17,20,55 టన్నుల వ్యర్థాలను నిల్వ చేసింది. పరిమితి దాటి పోయింది. ఆ వ్యర్థాలను వేరే ప్రాంతాలకు తరలించి, ఆ తరువాత కొత్త వ్యర్థాలు తీసుకోవాలి. కానీ యాజమాన్యం అలా చేయడం లేదు. పక్కనే ఏపీఐఐసీకి చెందిన 50 ఎకరాల స్థలం ఉంటే అందులో 20 ఎకరాలను వ్యర్థాల డంపింగ్‌కు వాడుకుంటోంది. అక్కడ ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిల్వ చేయడం, పరిశ్రమల నుంచే బూడిద వంటి వ్యర్థాలను బయట నిల్వ చేయడం వల్ల గాలి, నీరు కలుషితమవుతున్నాయి. వ్యర్థ రసాయనాలను స్థానిక చెరువులు, గెడ్డలోకి అనధికారికంగా విడిచిపెడుతోంది. వీటిపై ఫిర్యాదులు అందడంతో ... మిగతా 6వ పేజీలో

కొన్ని రూట్లలో అచ్చంగా మహిళా కండక్టర్లు

- మహిళా ప్రయాణికులు ఎక్కువగా ఉండే మార్గాల్లో నడిచే బస్సుల్లో నియామకానికి ఆర్టీసీ అధికారుల ఆలోచన



ద్వారకా బస్‌స్టేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):
మహిళా ప్రయాణికులు ఎక్కువగా ఉండే రూట్లలో మహిళా కండక్టర్లనే వినియోగించాలని ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు ఆలోచన చేస్తున్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం అవకాశం కల్పించనున్నట్టు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పుడు అన్ని రూట్లలోను మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగినా, కొన్ని రూట్లలో చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణించినా ఆశ్చర్యపోనవసరం లేదంటున్నారు. అలాంటి సందర్భాల్లో కండక్టర్లు మగవారైతే బస్సుల్లో ప్రయాణించే మహిళలు ఇబ్బందిపడే అవకాశం ఉంది. మహిళల మధ్య నుంచి ముందుకు, వెనక్కు తిరిగేందుకు మగ కండక్టర్లు కూడా ఇబ్బందిగా ఫీలవుతారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అలాంటి రూట్లలో తిరిగే బస్సుల్లో మహిళా కండక్టర్లనే నియమించాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు.

సింహాచలం, కనకమహాలక్ష్మి ఆలయం, కలెక్టరేట్, కేజీహెచ్ ... మిగతా 6వ పేజీలో

రెవెన్యూలో బదిలీలు

నలుగురు డిప్యూటీ తహశీల్దార్లకు స్థానచలనం

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో నలుగురు డిప్యూటీ తహశీల్దార్లను కలెక్టర్ బదిలీ చేశారు. ఇటీవల సీనియర్ డిప్యూటీ తహశీల్దార్లకు పదోన్నతి ఇచ్చారు. ఆ ఖాళీలను భర్తీ చేయడానికి నలుగురు డిప్యూటీ తహశీల్దార్లను బదిలీ చేస్తూ బుధవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. పెదగంట్యాడ డిప్యూటీ తహశీల్దారు బీఎస్ఎస్ ప్రసాద్‌ను భీమిలి, స్టీల్‌ప్లాంటు భూసేకరణ విభాగంలో ఎన్.రవికాంత్‌ను గాజువాకకు, పెందుర్తిలో పనిచేస్తున్న ఎ.సంతోషకిరణ్‌ను ఉక్కు భూ సేకరణ విభాగానికి, జాతీయ రహదారుల విభాగంలో పనిచేస్తున్న జి.కిషోర్‌ను పెందుర్తి మండల డీటీగా బదిలీ చేశారు.

వీఆర్వోలకు డిప్యూటేషన్

ఆనందపురం మండలం కుసులవాడ వీఆర్వోను పెందుర్తి మండలం చింతగట్లకు, పద్మనాభం మండలం పొట్నూరు వీఆర్వో బి.రమేష్‌నాయుడిని చినముషిడివాడకు డిప్యూటేషన్ వేశారు. అక్కడి వీఆర్వోలు పెందుర్తి తహశీల్దారు కార్యాలయంలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఇటీవలి బదిలీల్లో ఎస్.ఆర్.పురం నుంచి రమేష్‌నాయుడును పద్మనాభం మండలానికి బదిలీ చేయగా తిరిగి పెందుర్తికి డిప్యూటేషన్‌పై వచ్చారు. చింతగట్లలో ఐదెకరాల కొండపోరంబోకును ప్రైవేటు వ్యక్తుల పేరిట రెవెన్యూ రికార్డుల్లో నమోదుకు ప్రస్తుత వీఆర్వో అంగీకరించలేదు. దీంతోఅధికారపార్టీ నేత ఒత్తిడి తెచ్చి వీఆర్వోను తప్పించారనే ప్రచారం జరుగుతోంది.

మెట్రో ప్రాజెక్టు అలైన్‌మెంట్‌పై పునఃసమీక్ష

- ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఎండీ హామీ



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మెట్రో రైలు ప్రాజెక్ట్ గురించి వివరిస్తున్న ఎండీ రామకృష్ణారెడ్డి

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి):
విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టు అలైన్‌మెంట్‌పై పునఃసమీక్ష చేస్తామని, అధ్యయనానికి కమిటీని వేస్తామని డైరెక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు బుధవారం మంగళగిరిలో ఆయన్ను కలిశారు. మెట్రో రైలు ప్రాజెక్టుకు పదేళ్ల క్రితం సర్వే చేశారని, ఆ తరువాత విశాఖలో అనేక మార్పులు జరిగాయని, పాత అలైన్‌మెంట్ ప్రకారం ప్రాజెక్టు చేపడితే చాలా మంది ఇబ్బంది పడతారని ఎండీ రామకృష్ణారెడ్డికి వివరించారు. ప్రజలు, వ్యాపారులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. దానికి స్పందించిన ఎండీ ఒక కమిటీని వేసి క్షేత్ర పరిశీలన చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వివరాలను ఎమ్మెల్యేకు క్షుణ్ణంగా వివరించారు. జూలై 16 నుంచి 18 వరకు వివిధ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించగా, 204 కుటుంబాలు ప్రభావితం అవుతాయని, మరో 108 కుటుంబాలు నిర్వాసితులు అవుతారని గుర్తించామన్నారు.

‘మానవ అక్రమ రవాణాను అరికట్టాలి’

కొమ్మాది, జూలై 30 (ఆంధ్రజ్యోతి) :మానవ అక్రమ రవాణా నివారణపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని, ముఖ్యంగా బాలికలు పూర్తిగా తెలుసుకోవాలని భీమిలి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి స్వాతి భవాని అన్నారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఎంపాలెం ఎస్‌ఐ సునీత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

కొమ్మాది, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : దాతలు, స్వచ్ఛంద సంస్థలు పేదలను ఆదుకోవడానికి ముందుకు రావాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు, ఆరో వార్డు నాయకుడు గరే గురునాథ్ అన్నారు. బుధవారం ఆయన ఆర్‌హెచ్ కాలనీలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం కాలనీలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి సత్యనారాయణ, పోతిన రాము, కొప్పాక రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో గ్రామ పెద్దలు

తగరపువలస, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సంతపేట జీవీఎంసీ పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులను గ్రామస్థులు, విద్యా కమిటీ సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు.పాఠశాల నుంచి బదిలీ అయిన దుర్గాప్రసాద్, లీలామణి, జ్యోతి, వెంకటేష్, ఇందిరను శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ పదేళ్లుగా వారు పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. హెచ్‌ఎం పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు కృష్ణారావు, రామారావు, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణకు చర్యలు

» కలెక్టర్ హరేంధిరప్రసాద్

» రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణకు ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయం నుంచి రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో 30, 45, 27లకు లోబడి అభ్యంతరం లేని భూముల్లో 2019 అక్టోబరు 31వ తేదీలోపు ఇళ్లు నిర్మించుకున్న వారు తమ పరిధిలోని సచివాలయంలో డిసెంబరు 31లోగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గుడిసెలు, పూరిళ్లకు కూడా ఈ జీవోలు వర్తిస్తాయని, రెండేళ్ల తరువాత యాజమాన్య హక్కులు కల్పిస్తామన్నారు.150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారు 151 నుంచి 300 గజాల వరకు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం, ఎగువనున్న వారు మొత్తం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

స్పీచ్ థెరపితో సత్ఫలితాలు



స్పీచ్ థెరపిపై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు

భీమునిపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు భాష ఉచ్ఛరణలో వృద్ధి సాధించేందుకు ప్రభుత్వం భవిత కేంద్రాల్లో స్పీచ్ థెరపి శిక్షణ ఇస్తుందని ఎంఈవో-2 శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్పీచ్ థెరపి శిక్షణను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్పీచ్ థెరపిస్ట్ బాల ఈశ్వరి మాట్లాడుతూ వారంలో ఒక రోజు శిక్షణ ఇస్తామని, దీనివల్ల భాష ఉచ్ఛరణ మెరుగుపడుతుందని చెప్పారు. ఈకార్యక్రమంలో భవిత కేంద్రం ఐఈఆర్‌పీ కెజియా కుమారి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిని రక్షించిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానాలు చేస్తూ ప్రమాదానికి గురైన ఇద్దరిని లైఫ్‌గార్డులు బుధవారం రక్షించారు. బెంగళూరుకు చెందిన మంజునాథ్ (55), పాపయ్యగౌడ్ (40) రుషికొండ బీచ్‌కు బుధవారం విహారానికి వచ్చారు. తొలుత వారు బీచ్‌లో ఇసుక తెన్నెలపై కూర్చుని ఎగసిపడే కెరటాలను చూస్తూ ఆస్వాదించారు. అనంతరం సముద్ర స్నానాలకు దిగారు. పెద్ద అల వారిని తాకడంతో ప్రమాదానికి గురయ్యారు. ఈ విషయాన్ని సమీపంలో విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డులు గమనించి, వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.



కాపాడిన యువకులతో లైఫ్‌గార్డులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ హేమలత, నాయకులు

కొమ్మాది, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. వార్డు పరిధిలోని శారదానగర్ కాలనీలో రూ. 40 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువలు, మెట్ల మార్గాలకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని, ముఖ్యంగా శారదానగర్, సాయిరాంకాలనీ, శివశక్తినగర్, అయ్యప్పనగర్ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, మెట్లమార్గాలు, వీధి లైట్ల పనులు శరవేగంగా చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే ఆయా కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. అనంతరం స్థానికులు కార్పొరేటర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మొల్లి లక్ష్మణరావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ, జనసేన వార్డు అధ్యక్షుడు దేవర శివ, మన్యాల సోంబాబు, కొండపురాజు, నల్లాన ఆనందరావు పాల్గొన్నారు.

బైక్ దొంగకు 14 నెలలు జైలు

ఆనందపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని గిడిజాల సమీపంలో జరిగిన బైక్ చోరీ కేసులో ముద్దాయికి 14 నెలలు జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ భీమిలి 15వ అదనపు కోర్టు జడ్డి బుధవారం తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గిడిజాల సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ లైన్‌మేన్‌కు చెందిన బైక్ 2024లో చోరీకి గురైంది. ఆనందపురం క్రైమ్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి విజయనగరం జిల్లా డెంకాడ మండలం గొండిపాలెం గ్రామానికి చెందిన ఎర్రింటి కృష్ణబాబు అలియాస్ గం గుడు (23)పై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి విచారణ జరి పిన కోర్టు కృష్ణబాబుపై నేరం రుజువు కావడంతో 14 నెలలు జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధించారు. జరిమానా కట్టలేని పక్షంలో మరో 15 రోజులు జైలు శిక్ష విధించారు.

వచ్చే నెలలో ఒడిశా దాసుడి తిరుగు పయనం

సింహాచలం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తుడు, ఒడిశా కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకో దాసుడు సింహగిరి నుంచి వచ్చే నెలలో తిరుగు పయనం కానున్నారు. ఏటా చందనోత్సవం నాడు ఆయన బంధువులు, శిష్యులతో కలిసి సింహగిరికి చేరుకుని అప్పన్న సేవలో పాల్గొనడం ఆనవాయితీ. ఈమేరకు ఈఏడాది ఏప్రిల్ మూడో వారంలో సింహగిరికి వచ్చిన దాసుడు సింహాద్రినాథుడికి పలు ఆర్జిత సేవలు జరిపించారు. ఆగస్టు లో తిరుగు పయనానికి సన్నాహాలు చేస్తున్నట్టు దాసుడు తెలిపారు.

కేకే లైనులో రైళ్ల పునరుద్ధరణ

నేటి నుంచి యథావిధిగా రాకపోకలు

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కేకే (కొత్తవలస-కిరండూల్) లైనులో గురువారం నుంచి రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగిస్తాయని విశాఖపట్నం సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సాంకేతిక కారణాలతో కొన్ని రోజులుగా రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతో పాటు గమ్యాలు కుదించిన విషయం తెలిసిందే. గురువారం నుంచి కిరండూల్-విశాఖ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18516), విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501), ఆగస్టు ఒకటి నుంచి కిరండూల్-విశాఖ పాసింజర్ (58502) రైళ్లు యథావిధిగా తిరుగుతాయన్నారు. అలాగే హౌరా-జగదల్‌పూర్ మధ్య సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (ఎగువ, దిగువ) ఆగస్టు 1 నుంచి, జగదల్‌పూర్-రూర్కెలా ఇంటర్‌సిటీ (18108), జగదల్‌పూర్ - భువనేశ్వర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లు గురువారం నుంచి రాకపోకలు సాగిస్తాయన్నారు.

గృహ లబ్ధిదారులతో సమావేశం

మధురవాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం గృహ లబ్ధిదారులకు అన్ని వసతులతో ఇళ్లు నిర్మించనున్నట్టు ఏడో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ తెలిపారు.వార్డు పరిధిలోని ద్రోణంరాజు సత్యనారాయణ కల్యాణ మండపంలో బుధవారం ఆమె గృహ లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఇళ్ల స్థలాలు, పట్టాలు పొందిన వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి, నాయకులు అచ్యుత్, నాయుడు, సూర్యప్రకాశరావు, శివాజీ, దుర్గారావు పాల్గొన్నారు.

భర్తపై వేడి నీళ్లు

భీమునిపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : భర్తపై కోపంతో ఓ భార్య మరుగుతున్న వేడి నీళ్లను అతని శరీరంపై పోసి, తీవ్రంగా గాయపర్చింది. పట్టణం లోని నేరెళ్లవలస కాలనీలో మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. 4వ వార్డు నేరెళ్లవలస కాలనీలో దినసరి కూలీ నందిక కృష్ణ (30), భార్య గౌతమితో కలిసి నివశిస్తున్నారు.గౌతమి అత నికి మేనమామ కుమార్తె. ఎనిమిదేళ్ల క్రితం వివాహం కాగా మూడేళ్ల కుమార్తె ఉంది. మనస్పర్థల వల్ల ఇద్దరూ తరచూ గొడవలు పడుతుంటారు. ఇటీవల గౌతమి గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోగా పెద్దలు రాజీ కుదుర్చ మూడు రోజుల క్రితం భర్త వద్దకు తీసుకువచ్చారు. మంగళవారం రాత్రి గాఢ నిద్రలో వున్న కృష్ణపై ఆమె వేడి నీళ్లు తీసుకువచ్చి ముఖంపై, ఛాతిపై పోసింది. శరీరం కాలిపోవడంతో కృష్ణ గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల నివాసితులు వచ్చి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారు.ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాధాకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది.వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనములు చేసి షో డశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.

గీతంలో పైథాన్ ప్రోగ్రామింగ్‌పై ఎఫ్‌డీపీ

సాగర్‌నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ రంగంలో పైథాన్ ప్రోగ్రామింగ్ ప్రయోజనాలు అన్న అంశంపై బుధవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ (ఎఫ్‌డీపీ) కార్యక్రమం జరి గింది. ఐఐటీ గువహటిలోని ఎలక్ట్రానిక్స్, ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పరిశ్రమల నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంజనీరింగ్‌లో ఆటోమేషన్, కృత్రిమ మేథ, సిగ్నల్ ప్రాసెసింగ్, డేటా ఎనలిటిక్స్‌లో పైథాన్ ప్రోగ్రామింగ్ ప్రాధాన్యతను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్, ఈసీఈ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి. భరణిచంద్రకుమార్, ఎఫ్‌డీపీ కన్వీనర్లు డాక్టర్ వి. జ్యోతి, కరుణకుమారి, డాక్టర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా అప్పలరాజు బాధ్యతల స్వీకరణ

ఆనందపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) :సహకార సంఘాల ద్వారా అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవా లని ఆనందపురం వెంకటరంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రంకి అప్పలరాజు అన్నారు. బుధవారం ఆయన పీఏసీఎస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమమే పీఏసీఎస్‌ల ముఖ్య ఉద్దేశమన్నారు. రైతులకు రుణాల మంజూరులో తమ బ్యాంకు సేవలు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం రైతులకు రూ. 30 లక్షల రుణాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మీసాల రామునాయుడు, సీఈవో ఎస్.నారాయణరావు, జయరాం, సంచిముఖి, హేమంత్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

కొన్ని రూట్లలో అచ్చంగా మహిళా కండక్టర్లు

... 5వ పేజీ తరువాయి

ద్వారకా బస్ కాంప్లెక్స్, పూర్ణామార్కెట్, వీఎస్‌ఈజెడ్, విశాఖ రైల్వేస్టేషన్, దువ్వాడ రైల్వేస్టేషన్ వంటి ప్రాంతాలకు ఎక్కువమంది మహిళలు వివిధ అవసరాల మీద బస్సుల్లో రాకపోకలు సాగించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం విశాఖ రీజియన్‌లో 388 మహిళా కండక్టర్లు ఉండగా, వారిలో కనీసం 200 మందినైనా ఈ రూట్లలో షెడ్యూలింగ్ చేయాలని ఆలోచిస్తున్నారు.

కానరాని శతాబ్ది సందడి

... 5వ పేజీ తరువాయి

అంటీ ముట్టనట్టుగానే ఉంటోంది. ఏటా డిసెంబరు పదో తేదీన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహిస్తుంటారు. ఈ వేడుకలను జీఎంఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని దేశంలోని ప్రముఖులను తీసుకుని వస్తున్నారు. ఈ వేడుకలకు రతన్ టాటా, ఎల్ అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. ఈ ఏడాది రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీని తీసుకురావాలని జీఎంఆర్ భావించారు. ఈ మేరకు వర్సిటీ అధికారులకు సమాచారాన్ని అందించారు.అయితే, వందేళ్ల వేడుకల్లో బిజీగా ఉంటామని తెలియజేయడంతో ఆయన ఆ ఆలోచనను విరమించుకున్నట్టు తెలిసింది. ప్రస్తుత పరిణామాల పట్ల ఏయూ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్యాంపస్‌లో శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్న వాతావరణం కానరావడం లేదంటూ పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా వర్సిటీ అధికారులు వందేళ్ల వేడుకలపై దృష్టిసారిస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో ముగ్గురి అరెస్టు

ఎండాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో ముగ్గురిని సైబర్ క్రైం పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో ఇటీవల ఐదుగుర్ని అరెస్టు చేయగా వారి నుంచి సేకరించిన సమాచారం మేరకు మరో ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన వారిలో విజయనగరం జిల్లా మెంటాడ మండలానికి చెందిన లోకరపు తిరుపతి, జాగరపు సన్యాసిరావు, లచ్చిరెడ్డి పోలిరెడ్డి ఉన్నారు.

స్వామిత్వ సర్వేపై కార్యదర్శులకు శిక్షణ

ఆనందపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో స్వామిత్వ సర్వేపై బుధవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. డిప్యూటీ ఎంపీడీఓ సత్యన్నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణకు పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ సర్వే ద్వారా ప్రతి ఇంటికి కొలతలు వేసి వాటికి ప్రోపార్టీ కార్డు ఇస్తామని చెప్పారు. మూడు నెలల్లో ఈ సర్వేను పూర్తి చేయాల్సి ఉందన్నారు. సర్వే ఏవిధంగా చేపట్టాలి, విధి విధానాలపై ఆయన వివరించారు.

నగరపాలెంలో వైసీపీ ప్రచారం

భీమునిపట్నం (రూరల్), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నగరపాలెంలో వైసీపీ నాయకులు బుధవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పేరుతో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకరవ్గవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీను, ఎంపీపీ సూర్యనారాయణరాజు, సర్పంచ్ గౌతమి పాల్గొన్నారు.

ఆడిట్ పేరుతో యూసీడీ దందా

... 5వ పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మెప్మా ఎండీ ఆధ్వర్యంలో రెండు సంస్థలకు ఆడిట్ బాధ్యతలను అప్పగించారు. ఆడిట్ చేసినందుకు ప్రతి సంఘం రూ.300 చొప్పున ఆ సంస్థకు చెల్లించాలని ఆదేశాలు జారీచేశారు. డబ్బులు వసూలుచేసే బాధ్యతను ఆ జోన్‌లోని ఏపీడీలు సంబంధిత వార్డు కమ్యూనిటీ ఆర్గనైజర్(సీఓ)లకు అప్పగించారు. గత నాలుగు రోజులుగా నగరంలో మహిళా సంఘాల రికార్డుల ఆడిట్ జరుగుతోంది. ఆడిట్ కోసం రూ.300 చొప్పున సంఘాల నుంచి వసూలు చేయాలని మెప్మా ఎండీ ఆదేశాలు జారీచేయగా, ఇదే అదనుగా కొందరు యూసీడీ అధికారులు, సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. ఒక్కో గ్రూపు నుంచి రూ.300కి బదులుగా, ఆడిట్ సిబ్బందికి భోజనం, వసతి ఖర్చులు పేరుతో రూ.200 అదనంగా వసూలు చేస్తున్నారు. వాస్తవంగా ఆడిట్ చేసేవారికి ఎలాంటి ఖర్చులు చెల్లించాల్సిన అవసరం లేదు. జీవీఎంసీ పరిధిలో 35 వేల సంఘాల నుంచి రూ.70 లక్షలు అదనంగా వసూలుచేసి వాటాలుగా పంచుకునేందుకు సిద్ధమయ్యారు. కొందరైతే నాలుగేళ్ల ఆడిట్ చేయాల్సి ఉందని చెప్పి రూ.రెండు వేలు వసూలు చేస్తున్నారు. దీనిపై యూసీడీ పీడీ సత్యవేణి వివరణ కోరగా సంఘాల ఆడిట్ జరుగుతోందని, అదనపు వసూళ్ల సంగతి తనకు తెలియదన్నారు. దీనిపై అన్నిజోన్‌ల ఏపీడీలు, ఆర్పీలు, సీఓలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలు ఇస్తానని తెలిపారు.

భూములపై ఐటీ కంపెనీల కన్ను

... 5వ పేజీ తరువాయి

రుషికొండ, మధురవాడ ప్రాంతాల్లో ఉండడంతో వాటిని తమకు కేటాయించాలని ఐటీ సంస్థలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. రుషికొండ ప్రాంతంలో వీఎంఆర్‌డీఏ రెండు కీలకమైన ఐకానిక్ ప్రాజెక్టులకు ప్రణాళిక రూపొందించింది. లా కాలేజీకి వెళ్లే మార్గంలో పనోరమ హిల్స్ వద్ద సుమారు 8.82 ఎకరాల విస్తీర్ణంలో ఢిల్లీ తరహాలో ఈస్ట్ కోస్ట్ హేబిటేట్ సెంటర్ నిర్మాణానికి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన ఈ ఏడాది మార్చిలో చేసింది. ఆఫీస్ స్పేస్, బిజినెస్ సెంటర్, ఆడిటోరియం, ఎగ్జిబిషన్ హాల్, బొటిక్, హోటల్, సర్వీస్ అపార్ట్‌మెంట్, ప్రీమియం క్లబ్, ఈవెంట్/పార్టీ లాన్స్, ఫైన్ డైన్ రెస్టారెంట్లు, స్పోర్ట్స్ సెంటర్, సూపర్ మార్కెట్ అందులో ఉంటాయి. ఈ ప్రాజెక్టుకు సుమారుగా రూ.460 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా. 33 ఏళ్ల లీజుకు ఇస్తారు. అదేవిధంగా విశాఖపట్నం పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి సాధించడానికి ‘వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాల్టీ ఎరీనా అండ్ 3 స్టార్ హోటల్’ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. ఇది కూడా లా కాలేజీ మార్గంలో ఐకానికా గ్రాండ్ సమీపాన 2.82 ఎకరాల్లో వస్తుంది. 360 డిగ్రీల ఇమ్మెన్సివ్ థియేటర్, మిక్స్‌డ్ రియాల్టీ ఎస్కేప్ రూమ్, యానిమేషన్ షో, వీఆర్ గేమింగ్ జోన్, అక్వేరియం వంటి ఉంటాయి. డ్రైవ్-ఇన్ ఫుడ్ జోన్, 24/7 కేఫ్‌లు, 3 స్టార్ హోటల్ నిర్మిస్తారు. మధురవాడ పరిసర ప్రాంతాల్లోని ఐటీ కంపెనీలు, అందులో పనిచేసే ఉద్యోగుల కుటుంబాల అవసరాల కోసం దీనిని డిజైన్ చేశారు. అయితే వీటికి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన చేస్తే...పలు సంస్థలు తాము ఐటీ కంపెనీలు పెట్టుకుంటామని, ఆయా భూములు తమకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం వద్దకు వెళ్లాయి. వీఎంఆర్‌డీఏ మాత్రం తమ వద్ద ఇంకా అనేక భూములు అదే ప్రాంతంలో ఉన్నాయని, వాటిని ఐటీ సంస్థలకు ఇస్తామని, వీటిలో మాత్రం ముందుగా పేర్కొన్న ప్రాజెక్టులనే చేపడతామని స్పష్టం చేసినట్టు తెలిసింది. అలా చేస్తేనే కొత్త ఐటీ కంపెనీలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని, ఆ ప్రాంతం మరింత అభివృద్ధి సాధిస్తుందని వీఎంఆర్‌డీఏ ప్రతినిధులు అమరావతి అధికారులకు చెప్పినట్టు సమాచారం.

ఫార్మాసిటీలో వ్యర్థాల గుట్టలు

... 5వ పేజీ తరువాయి

ఏపీ పీసీబీ అధికారులు ఈ నెలలోనే నాలుగుసార్లు (12,13,17,18 తేదీల్లో) తనిఖీలు చేశారు. అనేక లోపాలు గుర్తించారు. నిబంధనలు పాటించడం లేదని తేల్చారు. నోటీసులు జారీచేశారు. ల్యాండ్ ఫిల్ పాండ్‌లో వ్యర్థాలను తరలించేంత వరకు కొత్త వ్యర్థాలను తీసుకురాకూడదని హెచ్చరించారు. నిల్వ చేసిన వాటిని దూర ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. బూడిద నిల్వలపై టార్పాలిన్లు కప్పాలని, గాలికి ఎగరకుండా చూడాలని సూచించారు. అక్కడి వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటులోకి వచ్చే వాహనాలను శుభ్రం చేసేందుకు శాశ్వత ఏర్పాట్లు లేకపోవడాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనపై వివరణ ఇవ్వాలని నోటీసు జారీచేశారు. ఆ తరువాత యాజమాన్యాన్ని విచారణకు పిలిచి, ప్రభుత్వానికి నివేదిక పంపించి, తగిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

ఎన్‌జీటీలో కేసు

- విశాఖ ఫార్మా సిటీ కాలుష్యంపై స్థానిక ప్రజా సంఘాలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)లో కేసు వేశాయి. తానాం గ్రీన్ బెల్ట్‌లోని బఫర్ జోన్‌లో చెరువు తవ్వారని, అది నిబంధనలకు వ్యతిరేకమని ఆరోపించాయి.
- పరిశ్రమల రసాయన వ్యర్థాలను పరవాడలోని మొల్లేటి గెడ్డలోకి విడిచిపెడుతున్నారని, దానివల్ల తాగునీరు కలుషితం అవుతోందని ఫిర్యాదు చేశారు.
- తాడిలోని ల్యాండ్ ఫిల్ (వ్యర్థాలు నిల్వ చేసే పాండ్) పూర్తిగా నిండిపోయిందని, అనధికారికంగా నిల్వ చేస్తున్నారని పేర్కొన్నారు. వీటన్నింటిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఏపీపీసీబీని ఎన్‌జీటీ ఆదేశించింది. అధికారులు నివేదిక సమర్పించగా, దానిపై ప్రస్తుతం వాదనలు జరుగుతున్నాయి. ఎన్‌జీటీలో కేసు ఉన్నా సరే విశాఖ ఫార్మా సిటీ యాజమాన్యం ఇప్పటికీ అవే తప్పులు చేయడం లెక్కలేనితనాన్ని రుజువు చేస్తున్నదని నాయకులు ఆరోపిస్తున్నారు.

మరోసారి భూ సమీకరణ

... 5వ పేజీ తరువాయి

చర్చించడంతో ఆయా జిల్లాల్లో సమీకరించడానికి అనువైన భూములను గుర్తించి సమాచారం అందించారు. ఆ ప్రకారం వీఎంఆర్‌డీఏకు వాటిని అప్పగించాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆర్‌డీఓలు భూ సమీకరణ చేయాలని సూచించింది. అసైన్డ్ పట్టా ఉన్న రైతులకు ఎకరాకు 900 గజాలు, ఆ భూమిలో పదేళ్లకు పైగా ఆక్రమణలో ఉంటే 450 గజాలు అభివృద్ధి చేసిన భూమి ఇస్తారు. ల్యాండ్ పూలింగ్ కోసం 2016లో చేసిన చట్టం ప్రకారం ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది.

విజయనగరం జిల్లాలో 25.41 ఎకరాలు.

- డెంకాడలో సర్వే నంబర్లు 241, 242, 243లలో 20.41 ఎకరాలు.
- భోగాపురం మండలం రావాడ సర్వే నంబరు 64/1లో 5 ఎకరాలు.

అనకాపల్లి జిల్లాలో 783.69 ఎకరాలు

- సబ్బవరం మండలం అంతకాపల్లిలో 175.42 ఎకరాలు
- బాటజంగాలపాలెంలో 141.01 ఎకరాలు
- ఎ.సిరసపల్లిలో 371.75 ఎకరాలు
- నాళ్ల రేగుడిపాలెంలో 27.37 ఎకరాలు
- పైడివాడ అగ్రహారంలో 28.14 ఎకరాలు
- అనకాపల్లి మండలం తగరంపూడిలో 40 ఎకరాలు

నేటి నుంచి ప్రత్యేక అభిషేకాలకు బుక్ చేసుకునే అవకాశం

» సంపత్ వినాయగర్ ఆలయంలో ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 4 వరకు వినాయకచవితి ఉత్సవాలు



సిరిపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ సంపత్ వినాయగర్ స్వామి వినాయక చతుర్థి మహోత్సవాలను ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 4 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక సభ్యులు టీఆర్ చోళన్, ఈవో డీవీవీ ప్రసాదరావు తెలిపారు. చవిత నాడు ఉదయం 3 గంటలకు పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ ఉత్సవాల్లోని స్వామివారి ప్రత్యేక అభిషేకంలో పాల్గొనే నిమిత్తం ఈ నెల 31న ఉదయం 8.30 గంటల నుంచి ఉభయదాతలు వారి గోత్రనామాలతో పూజలు ముందుగా బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సేవలో పాల్గొనే నిమిత్తం రూ.2500 దేవస్థానం కౌంటర్‌లో చెల్లించి ఆన్‌లైన్ రసీదు పొందాలని కోరారు. ఈ సేవల్లో పాల్గొనే ఉభయ దాతలకు అభిషేకం అనంతరం శ్రీ స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు (పంచె, కండువా, చీర, జాకెట్) స్వామివారి అలంకరణ ఫోటో, తీర్థప్రసాదాలను ఆలయ అర్చకుల ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల ఆభయదాతలు పైన తెలిపిన ఉత్సవ రోజుల్లో అభిషేకం సేవలో పాల్గొన వచ్చని కోరారు.

వైద్య పరికరాల కొనుగోలు కోసం భిక్షాటన

» సీపీఎం వినూత్న నిరసన



భిక్షాటన చేస్తున్న సీపీఎం నేతలు

మహారాణిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లోని గుండె జబ్బుల వార్డులో వైద్య పరికరాల కొనుగోలుకు విరాళాలివ్వాలని కోరుతూ సీపీఎం భిక్షాటన చేసింది. ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బుధవారం కేజీహెచ్ , కలెక్టరేట్ జంక్షన్ వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ రెండుచోట్లకు వచ్చిన వారి వద్ద కేజీహెచ్‌లో గుండె జబ్బుల వార్డు దుస్థితిని వివరిస్తూ ఆర్థిక సాయం చేయండంటూ అర్థించారు. భిక్షం వేసి రాష్ట్ర ప్రభుత్వానికి కొంత తోడ్పాటు అందించాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ గుండె జబ్బుల వార్డులో వైద్య పరికరాలు మూలన పడ్డాయని, 7 నెలలుగా శస్త్రచికిత్సలు నిలిపివేయటం పేదలకు వైద్య సదుపాయం నుంచి దూరం చేయటమేనని ఆక్షేపించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు కాసులు కురిపించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. పేదలు ఆర్థిక స్థోమత లేక వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని, అలాంటి వారికి వైద్యం అందించకుండా ప్రభుత్వం, ఆసుపత్రి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

సినిమా గైడ్

- **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీవెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),
- **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు)32, బెండకాయలు 38, పచ్చిమిర్చి 66, కాకరకాయలు 30, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 36, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 66, బరబాటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 50, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 40, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

విశాఖలో మరింత పర్యాటక అభివృద్ధి

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జాయింట్ కమిషనర్ రమేష్ తదితరులు

బీచ్ రోడ్డు, జూలై 30, (ఆంధ్రజ్యోతి) : విశాఖను పర్యాటకపరంగా మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. శుద్ధి చేసే తాగునీటి సదుపాయాల యంత్రాలను బుధవారం ఆర్కే బీచ్ కురుసర సబ్‌మెరైన్ మ్యూజియం, టీయూ- 142 యుద్ధ విమానం మ్యూజియం వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీఎంఆర్డీఏ ద్వారా మౌలిక సదుపాయాల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. సుమారు రూ.30 లక్షలతో తాగునీటి శుద్ధి పరికరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సాగర తీరానికి పర్యాటకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోందని, వారికి మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖపట్నం అన్ని రంగాల్లో అభివృద్ధికి ఆస్కారం ఉన్న ప్రాంతమన్నారు. విశాఖకు ఉజ్వల భవిష్యత్తు ఉందని చెప్పారు. పర్యాటకంగా విశాఖ నగరానికి మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం పర్యాటకంగా ఎన్నో అభివృద్ధి పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు. వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విశాఖను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తోందని వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షణా ఇంజినీరు భవానీశంకర్, కార్యనిర్వాహక ఇంజి నీర్లు రామరాజు, దుర్గాప్రసాద్, దివీస్ ప్రతినిధులు కోటేశ్వరరావు, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

చాకలిపేటకు విద్యుత్ సరఫరా నిలిపివేతకు యత్నం

» విద్యుత్ సిబ్బందిని ప్రతిఘటించిన రజకులు
» పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామంటూ హెచ్చరిక
» వెనుదిరిగిన విద్యుత్ శాఖ సిబ్బంది
» ఇవన్నీ కార్పొరేటర్ కుతంత్రాలు అంటూ చాకలిపేట వాసుల ఆగ్రహం



కరెంట్ కట్ చేస్తే పెట్రోల్ పోసుకుంటానని విద్యుత్‌శాఖ సిబ్బందిని అడ్డుకుంటున్న స్థానికులు

మద్దిలపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ చాకలిపేటలో నివాసాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేసేందుకు బుధవారం విద్యుత్‌శాఖ సిబ్బంది రావడం తీవ్ర వివాదానికి దారితీసింది. సరఫరా నిలిపి వేస్తే ఆత్మహత్య చేసుకుంటామని బాధితులు బాటిల్స్‌తో పెట్రోల్ పట్టుకుని బెదిరించారు. అరవై ఏళ్ల నుంచి కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నాం, పన్నులు కడుతున్నాం, కోర్టు కూడా తమకు పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందని చెబుతూ అందుకు సంబంధించిన పత్రాలు అధికారులకు చూపించారు.

అయితే కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ తమకు పంపించారని, కోర్టు ఆర్డర్ ఉన్నా మాకు సంబంధం లేదు కరెంట్ కట్ చేస్తామని విద్యుత్ సిబ్బంది స్పష్టం చేయడంతో చాకలిపేట మహిళలు ఆందోళనకు దిగారు.

ఈ సందర్భంగా బాధితులు కనక శ్రీనులు మాట్లాడుతూ వాంబే గృహాలకు ఆనుకుని ఉన్న స్థలంలో అరవై ఏళ్లుగా పాకల ఇల్లు, దుకాణం నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ ఉండేందుకు కోర్టు కూడా పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఈ స్థలంపై పీతల మూర్తి యాదవ్ కన్ను పడిందని ఆరోపించారు. ఇక్కడ నాలుగు అంతస్తుల భవనం నిర్మించి మీకో ఫ్లోరు ఇచ్చి మూడు ఫ్లోరులు నేను తీసుకుంటానని ప్రతిపాదనలు పెట్టాడన్నారు. అందుకు అంగీకరించక పోవడంతో ముందు వాంబే గృహంలోని గోడ కూలగొట్టించారని ఆరోపించారు. వాంబే గృహాలకు వినియోగించే వాటర్ ట్యాంక్ పగలగొట్టడానికి మూర్తి యాదవ్ వస్తే అడ్డుకున్నామన్నారు.

దీంతో తమను ఏ విధంగానైనా ఖాళీ చేయించాలని నివాసాల ముందు రోడ్డు మార్గం తవ్వించారన్నారు. యాభై రోజులుగా తవ్విన గోతుల్లో బురద పేరుకుపోయి కంపుకు ఉండలేకపోతున్నామన్నారు. రోజూ మూర్తి యాదవ్ వచ్చి దుకాణం, పాక కూలగొడతానంటూ బెదిరించడంతో మా అమ్మ సింహాచలం ఒత్తిడికి గురై బీపీ పెరిగి భయంతో మృతి చెందిందన్నారు. అయినా మూర్తియాదవ్‌కు మాపై జాలి కలగలేదన్నారు. రెండు రోజుల నుంచి విద్యుత్ సిబ్బందికి పంపించి కరెంట్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారంటూ మండిపడ్డారు. పాకలో కాలు లేని వికలాంగుడు నివాసం ఉంటున్నాడని, పాక తీస్తే ఆయన పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అధికారులకు తప్పుడు సమాచారంతో తప్పుదోవ పట్టించి తమపై ఉసుగొల్పుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డులో మితిమీరుతున్న మూర్తియాదవ్ దౌర్జన్యాలు, రౌడీయిజంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టేబుల్ టెన్నిస్ విజేతకు అభినందనలు



మహీధరవర్మను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ బోస్, డైరెక్టర్లు

ఎంవీపీ కాలనీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న ఒంగోలు, ప్రకాశం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్‌లు సంయుక్తంగా నిర్వహించిన అండర్-19 బాలుర విభాగంలో ఏపీ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్-2025లో ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ విద్యార్థి పి.మహీధర వర్మ ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేఎస్ బోస్, డైరెక్టర్ గిరిధర్‌లు.. మహీధర వర్మను అభినందించారు.

రా.వి.శాస్త్రి రచనలు సామాజిక జీవన ప్రతిబింబాలు

» జయంతి కార్యక్రమంలో వక్తలు



రా.వి.శాస్త్రికి నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, విద్యార్థులు

బీచ్ రోడ్డు, జులై 30, (ఆంధ్రజ్యోతి) : విశ్వనాథ శాస్త్రి తన రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేశారని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ పేర్కొన్నారు. బుధవారం ఆర్కే బీచ్ వద్ద ఉన్న రాచకొండ విశ్వనాథ శాస్త్రి మెమోరియల్ దగ్గర ఆయన జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ కలమే ఆయుధంగా బడుగు, బలహీనవర్గాల జీవన పోరాటానికి అక్షర రూపం ఇచ్చిన మహా మనిషి రాచకొండ విశ్వనాథ శాస్త్రి అని కొనియాడారు. న్యాయశాస్త్రంతో పాటు సాహిత్యంపై పట్టు ఉన్న శాస్త్రి సాధారణ ప్రజల జన జీవితాన్ని తన రచనల ద్వారా ప్రతిబింబించారన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎం.కె. శ్రీనివాస్, ప్రముఖ రచయిత డీవీ సూర్యారావు, ప్రముఖ న్యాయవాది కేవీ. రామ్మూర్తి, కేవీ నర్సింహమూర్తి, నమ్మి సన్యాసిరావు, సీఎస్ శేఖర్, చింతపల్లి రాంబాబు, బెవర సత్యనారాయణ, వేదుల సోమేశ్వరరావు, విద్యార్థులూ పాల్గొన్నారు.

అక్షర శిల్పి రావిశాస్త్రి..

వెంకోజీపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఏయూ తెలుగు విభాగాధ్యక్షులు ప్రొఫెసర్ జర్రా అప్పారావుఅధ్యక్షతన బుధవారం రావి శాస్త్రి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రావి శాస్త్రి నవలాకారుడుగా, కథకుడుగా, నాటక కర్త, నాటికల రచయిత, గల్పికల రచయిత, లేఖల రచయిత, విమర్శకుడు, సంపాదకుడు, న్యాయ కోవిదుడుగా బహుముఖ ప్రతిభాశాలి అని కొనియాడారు. ఈయన కథలు విశ్వవిద్యాలయ స్థాయిలో సిలబస్‌లో కూడా పెట్టడం జరిగిందన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ తాను ఎన్నుకున్న మార్గంలో నిజాయితీగా, నిబద్ధతతో చివర వరకూ పయనించిన గొప్ప రచయిత రావిశాస్త్రి అని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్.గిరీష్‌కుమార్, డాక్టర్ ఆర్.శివయ్య, డాక్టర్ ఎం.దాసు, డాక్టర్ బీర సూర్యనారాయణ, డాక్టర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.కృష్ణవేణి పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏయూలో రావిశాస్త్రికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



ఎమ్మెల్యేకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న స్థానికులు

మద్దిలపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 22వ వార్డులోని సిద్ధార్థనగర్, రేసపువానిపాలెం ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటున్నామన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు ఇప్పటికే చాలా అమలు చేశామని, మిగిలిన హామీలు త్వరలోనే అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయకులు బొట్టా నీలిమ, బొట్టా వెంకటరమణ, దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, రాజకుమార్, డేవిడ్, డొక్కరి శ్రీనివాస్, వెలగపూడి ప్రతాప్‌రుద్ర, డేవిడ్, రాజ్‌కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ పార్కును పరిశీలించిన చైర్మన్, కమిషనర్



పార్కులో సందర్శిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తదితరులు

పెదవాల్తేరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌బుధవారం వీఎంఆర్డీఏ పార్కును క్షేత్రస్థాయిలోఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాకర్స్, సందర్శకులతో కలిసి మాట్లాడారు. కొన్ని నిర్వహణపరమైన పనులు, మరమత్తులను 20 రోజుల్లో శతశాతం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కొన్ని పనులను ఇప్పటికే 90 శాతం పూర్తిచేశామని, అన్నిటిని పూర్తి చేసి మెరుగైన వసతులు కల్పిస్తామని చెప్పారు. పార్కు గతంలో కంటే నిర్వహణ బాగా ఉందని వాకర్స్ కొనియాడారు.ఈ పర్యటనలో ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ భవానీ శంకర్, డీఎఫ్‌వో సుజాతా శివానీ, కార్యనిర్వహక ఇంజనీర్లు రామరాజు, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలల అక్రమ రవాణా నిరోధంపై అవగాహన ర్యాలీ



బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, అప్‌హోల్డ్ ఎన్జీవో బహుళ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్ర పంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం గా పాటించారు. దీనిలో భాగంగా బాలల అక్ర మ రవాణాపై అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండా లని సూచిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంత రం విశాఖ రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ, ఆర్పీఎఫ్, జిల్లా మహిళా, సంక్షేమ సంఘం, డీసీపీయూ, వైజాగ్ ఎన్జీవోస్ ఫోరం, స్టేషన్‌లోని వెంటర్స్ ప్రతినిధులుసదస్సు నిర్వహించి బాలలు, మహిళల అక్రమ రవాణాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ అక్రమ రవాణా నిరోధానికి సమన్వయం, సమష్టి కృషితో అంతర్గత సంస్థలు చర్యలు తీసుకోవలసిన అవసరాన్ని గుర్తించారు. అప్‌హోల్డ్ ఎన్జీవో విశాఖలో పిల్లల రక్షణ, హక్కులతోపాటు న్యాయం అందించడంలో చురుగ్గా పనిచేస్తోందన్నారు. పిల్లల రక్షణ చట్టాలను రూపొందించడంలో 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' సంస్థ గణనీయమైన పాత్ర పోషించిందని, 418 జిల్లాల్లో సుమారు 250 ఎన్జీవో సంస్థల భాగస్వామ్యంతో చురుగ్గా పనిచేస్తోందన్నారు. గత ఏడాదిలో బాల కార్మికులతోపాటు అక్రమ రవాణాకు గురైన 359 మందిని అప్‌హోల్డ్ ఎన్జీవో బహుళ సంస్థ రక్షించిందని, అలాగే బాల్య వివాహాలను అడ్డుకుందన్నారు.

విద్యా సంస్థలకు ప్రైవేటు సంస్థల సహకారం అభినందనీయం : కలెక్టర్



ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ హరింధర్ ప్రసాద్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

ఆరిలోవ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : విద్యాసంస్థలకు సహకారం అందించే విషయంలో ప్రైవేటు సంస్థలు, కంపెనీలు స్పందిస్తున్న తీరు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎంఎస్ఎన్ హరింధర్ ప్రసాద్ కొనియాడారు. జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయం ప్రాంగణంలో దివీస్ లేబలేటరీ (చిప్పాడ) సామాజిక బాధ్యతలో భాగంగా సుమారు 22.60 లక్షలతో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ భవన నిర్మాణానికి సహకరించిన దివీస్ లేబరేటర్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. గత సంవత్సరం భీమిలి మండలం పరిధిలో పదో తరగతిలో వెనుక బడిన విద్యార్థులకు దివీస్ సంస్థ స్టడీ మెటీరియల్‌ను అందించారని, పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో మూడో స్థానంలో విశాఖ జిల్లా నిలిచేందుకు ఇది కొంతవరకు దోహదపడిందన్నారు. అడిగిన వెంటనే తమ సామాజిక బాధ్యతగా నిధులు అందించిన దివీస్ యాజమాన్య ఔదార్యం గొప్పదన్నారు.

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ.. విశాఖ జిల్లాలోని పాఠశాల విద్యకు మౌలిక సదుపాయాల కల్పనలో ప్రైవేటు సంస్థల పాత్ర అభినందనీయమని ప్రశంసించారు. ఈ భవన నిర్మాణానికి నిధులు అందజేసిన దివీస్ లేబరేటరీ యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో ప్రైవేటు సంస్థలు ఉదారత ప్రదర్శిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఉత్తరాంధ్ర గ్రాడుయేట్స్ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఈ శిక్షణా కేంద్రాని చక్కగా వినియోగించుకొని తద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలన్నారు. పదో తరగతి ఫలితాల్లో విశాఖ జిల్లా రాష్ట్రంలో అత్యున్నత స్థానంలో ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. 'దివీస్' జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ కంపెనీ ఎల్లప్పుడూ విద్యాపరమైన అంశాలకు ప్రాధాన్యం ఇస్తుదన్నారు. పాఠశాలల అభివృద్ధికి తమ వంతుగా సహకారం అందిస్తామన్నారు.

అన్న క్యాంటీన్‌లో ఆకస్మిక తనిఖీ



అన్న క్యాంటిన్‌కు వచ్చిన వారితో మాట్లాడుతున్న సీఎంహెచ్‌వో నరేశ్‌కుమార్, జడ్సీ-2 కనకమహాలక్ష్మి

ఆరిలోవ/ ఎంవీపీ కాలనీ, జూలై 30 (అంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్‌కు సమీపంలో విమ్స్ ఆస్పత్రికి ఎదురుగా బీఆర్టీఎస్ రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ను బుధవారం ఉదయం జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న వారితో మాట్లాడి ఫుడ్ ఎలా ఉందంటూ ఆరా తీశారు. వారు కూడా అక్కడే టిఫిన్ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంటిన్ పరిసరాలను పరిశీలించారు. శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని క్యాంటిన్ సిబ్బందిని సూచించారు. అలాగే ఎంవీపీ కాలనీలోని రైతు బజారు పక్కనున్న అన్న క్యాంటీన్‌ను జీవీఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ బుధవారం రాత్రి సందర్శించారు.

సకాలంలో గుర్తిస్తే గర్భాశయ క్యాన్సర్‌కు చెక్



గర్భాశయ క్యాన్సర్‌పై పోస్టర్ ఆవిష్కరిస్తున్న అపోలో వైద్య బృందం

ఆరిలోవ, జూలై 30 (అంధ్రజ్యోతి) : మహిళలకు సోకే గర్భాశయ క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే నయం చేయడం సాధ్యమేనని అపోలో వైద్య బృందం తెలిపారు. బుధవారం ఆరిలోవ హెల్త్ సిటీలో గల అపోలో వైద్యశాలలో బుధవారం గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సైలంట్‌కిల్లర్‌గా చెప్పబడే అండాశయ క్యాన్సర్ 55 నుంచి 64 ఏళ్ల వయసులో ఉన్న మహిళలకు అధికంగా వస్తుందన్నారు. సమావేశంలో డాక్టర్లు సుమన్‌దాస్, ఎంపీ చంద్రకల్యాణ్ సౌధామణి, శ్రీదేవి, సీవోవో కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మాధవధార, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మాధవధార ఎస్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆగస్టు 1న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ మాధవధార ఫీడర్ నుంచి సరఫరా అయ్యే ఆర్టీఏ కార్యాలయ ప్రాంతాలు, ఆర్టీఏ కార్యాలయం వెనుక ఎస్.ఆర్.నగర్, ఎయిర్‌పోర్ట్ పోలీసు స్టేషన్ ఏరియా, 286, 289 మాధవధార ఉడాకాలనీ సచివాలయం ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు. ఎన్ఏడీ కొత్తరోడ్డు, కాకానినగర్, పంజాబీ ధాబా, ఐఎన్ఎస్ డేగా ఏరియాల్లో సరఫరాకు అంతరాయడం కలుగుతుందన్నారు. 11 కేవీ కాకానినగర్ ఫీడర్ పరిధిలోని నివాసిత ప్రాంతాలు, రెల్లి వీధి, వినోద్‌నగర్, విమాన్ నగర్, ఎస్.వి.కె.నగర్ ప్రాంతాలకు సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఏర్పడనుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేసి చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నట్లు ఈఈ తెలియజేశారు.

త్వరలో వైసీపీ నాయకుల జాతకాలు బయటపెడతాం

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్

మహారాణిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తున్న వైసీపీ నాయకులు వాసుపల్లి గణేష్‌కుమార్, కె.కె.రాజు తదితరుల జాతకాలు త్వరలోనే బయటపడతాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. స్థానిక వైసీపీ నాయకులు చేసిన పాపాలు తెలుగుదేశం మరచిపోలేదని అందరికీ తగిన గుణపాఠం చెపుతామని అన్నారు. తెలుగుదేశంలో అవినీతి, తప్పులు చేసిన నాయకులు ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. ఆరోపణలు నిరూపణ అయితే పార్టీ కఠిన చర్యలు తీసుకుంటుందని, అంతేకాని తమ నాయకునిపై నచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని నజీర్ హెచ్చరించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలన నయవంచనకు మారు పేరు అని వ్యాఖ్యానించారు. నాసిరకం మద్యం విక్రయించి ఆ పార్టీ నాయకులు కోట్ల రూపాయలు కొల్లగొట్టారని, చిన్న నాయకుడి వద్ద రూ.11 కోట్లు హవాలా డబ్బు బయటపడిందంటే పెద్ద నాయకులు ఎన్ని వేల కోట్ల రూపాయలు వెనకేసుకున్నారో అర్థమవుతుందన్నారు.

పారిశుధ్య నిర్వహణపై కలెక్టర్ ఆరా



32వ వార్డులో పర్యటిస్తున్న కలెక్టరు హరేంధిర ప్రసాద్, కార్పొరేటర్ కందుల నాగరాజు తదితరులు

అల్లిపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. బుధవారం వార్డు పరిధిలోని నేరెళ్ల కోనేరు, సీపీఐ కార్యాలయం, ఏడుగుళ్లు, అల్లిపురం మార్కెట్ ప్రాంతాల్లో కార్పొరేటర్ కందుల నాగరాజుతో కలసి పర్యటించారు. ప్రజల సమస్యలను, పారిశుధ్య నిర్వహణ తీరును, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సీపీఐ కార్యాలయం వద్ద ఆటో మరమ్మతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, డ్రగ్స్, గంజాయి సేవించేవారు ఎక్కువయ్యారని, ఈ సమస్య పరిష్కరించాలని కార్పొరేటర్, స్థానికులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌ను కలెక్టరు కోరారు. చలువతోటలో నిర్మిస్తున్న కల్యాణమండపం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ ఈఎస్‌వీ నరేష్, జడ్సీ మల్లయ్యనాయుడు, ఏఎంహెచ్ఓ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్ తనిఖీలు

డాబాగార్డెన్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి చెత్త సేకరణపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించాలని జోనల్ 4 కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు పేర్కొన్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని లలితాకాలనీ, గొల్లలపాలెం తదితర ప్రాంతాల్లో ఆయన బుధవారం విస్తృతంగా పర్యటించారు. గొల్లలపాలెం, లలితకాలనీ వాసులతో మాట్లాడి చెత్త సేకరించడానికి పారిశుధ్య సిబ్బంది ఇంటికి వస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. కాలువల్లో పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. లలితాకాలనీలోని పార్కులను శుభ్రంగా ఉంచాలన్నారు. డాబాగార్డెన్స్ ప్రాంతంలో వాణిజ్య సముదాయాల వారు రోడ్లపై చెత్త వేస్తే అపరాధ రుసుము వసూలు చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ కవర్లు ఎవరు వాడకుండా, అల్పాహారం, కూరగాయలు విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి అపరాధ రుసుము వసూలు చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలను ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.కామేశ్వరరెడ్డి, సెక్రటరీలు, మేస్త్రీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



లలితాకాలనీ పార్కులో పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

వివిధ కంపెనీలతో బీఎస్ఎన్ఎల్ ఒప్పందాలు



ఒప్పంద ప్రతులు చూపుతున్న బీఎస్ఎన్ఎల్ అధికారులు, వివిధ కంపెనీల డైరెక్టర్లు

డాబాగార్డెన్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ 'కౌసలం' ప్రాజెక్టులో భాగంగా 8 కంపెనీలతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు బీఎస్ఎన్ఎల్ పీజీఎం పాల్ వినియం తెలిపారు. డాబాగార్డెన్స్ జనరల్ మేనేజర్ కార్యాలయంలోని ఆయా కంపెనీలకు చెందిన డైరెక్టర్లతో కలిసి ఒప్పందంపై సంతకాలు చేశామన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ టెక్నాలజీ పరంగా ఆయా కంపెనీలతో కలిసి పనిచేస్తుందన్నారు.ఇప్పటికే అమల్లో ఉన్న సాంకేతికతను మరింతగా మెరుగుపర్చేందుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ పీజీఎం ఆపరేషన్ జి.ఆడమ్, ఎం.సత్యప్రసాద్, బి.ఎస్.శ్రీనివాస్, ఆయా కంపెనీల డైరెక్టర్లు, టీమ్ లీడర్లు పాల్గొన్నారు.

ఆసియా రోలర్ స్కేటింగ్ టోర్నీలో పతకాలు



పతకాలు సాధించిన దినేష్, క్షేత్ర, సంహిత

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నగర స్కేటర్లు దినేష్, శివకోటి క్షేత్ర, సాయి సంహిత పతకాలు సాధించారు. దక్షిణ కొరియాలో జరిగిన ఈ టోర్నీ పెయిర్ డ్యాన్స్ ఈవెంట్‌లో శివకోటి క్షేత్ర అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించి రజత పతకం కైవసం చేసుకుంది. గొలగాని దినేష్ పెయిర్ డ్యాన్స్‌లో రెండు రజత పతకాలు, సాయి సంహిత ఒక స్వర్ణం, రజత పతకాలు సాధించారు. భారత జట్టుకు కోచ్‌గా విశాఖకు చెందిన వి.సత్యనారాయణ (సత్యం) వ్యవహరించారు. కోచ్‌లు, నిపుణులు సంతోషం వ్యక్తంచేశారు.


రేపటి నుంచి దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు

జ్ఞానాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పునీతుపేతు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ఆగస్టు 1 నుంచి 15 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు విచారణకర్త ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు. జ్ఞానాపురం చర్చి ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహోత్సవాలకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. 1న దివ్యబలిపూజ అనంతరం సిలువగుర్తు మండపంలో పీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్ పతాక ఆవిష్కరణతో ఉత్సవం ప్రారంభమవుతుందన్నారు. 14వరకు రోజూ జపమాల, దివ్యపూజ, పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. 6 నుంచి 14 వరకు నవదిన ప్రార్థనలు, 15న ప్రధాన ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఫాదర్‌లు విమల్‌రాజ్, ప్రేమ్‌కుమార్, మరియ రత్నం, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణకు చర్యలు

వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణకు ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయం నుంచి రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో 30, 45, 27లకు లోబడి అభ్యంతరం లేని భూముల్లో 2019 అక్టోబరు 31వ తేదీలోపు ఇళ్లు నిర్మించుకున్న వారు తమ పరిధిలోని సచివాలయంలో డిసెంబరు 31లోగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గుడిసెలు, పూరిళ్లకు కూడా ఈ జీవోలు వర్తిస్తాయని, రెండేళ్ల తరువాత యాజమాన్య హక్కులు కల్పిస్తామన్నారు.150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారు 151 నుంచి 300 గజాల వరకు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం, ఎగువనున్న వారు మొత్తం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవ్వ కుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

మహారాణిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మెరైన్ పోలీసులు తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కోస్టల్ సెక్యూరిటీ పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సముద్రంలో లోపలకు వెళ్లకుండా నిరోధించేందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. తుపానులు, అల్పపీడన సమయాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా, వారి సమాచారాన్ని అందించే ట్రాన్స్‌పాండర్‌ల కు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. రుషికొండ మెరైన్ పోలీసు స్టేషన్ వద్ద రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని, కానిస్టేబుళ్లు, హోంగార్డుల నియామకానికి చర్యలు తీసుకోవాలని మెరైన్ అధికారులు కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో మెరైన్ పోలీసు, కస్టమ్స్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు కేజీహెచ్‌లో ఓపీ సేవలు

మహారాణిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో రోజూ సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య వయో వృద్ధులకు ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నట్లు ఆర్ఎంవో డాక్టర్ బంగారయ్య తెలిపారు. వయో వృద్ధుల సమస్యలపై కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుర్తు తెలియని వ్యక్తులు, భిక్షాటన చేసుకునేవారు అనారోగ్యంతో వస్తే ప్రత్యేక వార్డులో సేవలందిస్తున్నామని, ఈ సేవల విస్తృతికి యంత్రాంగం సహాయం, సహాయకులను కేటాయించాలని కోరారు.

అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ డైరెక్టర్‌గా ఆకుల జైఆంధ్ర

మహారాణిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ డైరెక్టర్‌గా ఆకుల జైఆంధ్ర నియమితులయ్యారు. బుధవారం జరిగిన కమిటీ సమావేశంలో కార్యవర్గ సభ్యులను నియమించారు. కేజీహెచ్ ఉద్యోగి అయిన జైఆంధ్ర నగర రెల్లికుల అధ్యక్షుడిగా ఉన్నారు.

భర్తపై వేడి నీళ్లు పోసిన భార్య

భీమునిపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : భర్తపై కోపంతో ఓ భార్య మరుగుతున్న వేడి నీళ్లను అతని శరీరంపై పోసి, తీవ్రంగా గాయపర్చింది. పట్టణం లోని నేరేళ్ల వలస కాలనీలో మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. 4వ వార్డు నేరేళ్లవలస కాలనీలో దినసరి కూలీ నందిక కృష్ణ (30), భార్య గౌతమితో కలిసి నివశిస్తున్నారు. గౌతమి అత నికి మేనమామ కుమార్తె. ఎనిమిదేళ్ల క్రితం వివాహం కాగా మూడేళ్ల కుమార్తె ఉంది. మనస్పర్థల వల్ల ఇద్దరూ తరచూ గొడవలు పడుతుంటారు. ఇటీవల గౌతమి గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోగా పెద్దలు రాజీ కుదుర్చ మూడు రోజుల క్రితం భర్త వద్దకు తీసుకువచ్చారు. మంగళవారం రాత్రి గాఢ నిద్రలో వున్న కృష్ణపై ఆమె వేడి నీళ్లు తీసుకువచ్చి ముఖంపై, ఛాతిపై పోసింది. శరీరం కాలిపోవడంతో కృష్ణ గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల నివాసితులు వచ్చి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాధాకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కేకే లైనులో రైళ్ల పునరుద్ధరణ

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కేకే (కొత్తవలస-కిరండూల్) లైనులో గురువారం నుంచి రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగిస్తాయని విశాఖపట్నం సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. కొన్ని రోజులుగా రైళ్ల గమ్యాలు కుదించిన విషయం తెలిసిందే. గురువారం నుంచి కిరండూల్-విశాఖ రాత్రి ఎక్స్‌ప్రెస్, విశాఖ-కిరండూల్ పాసింజర్, ఆగస్టు ఒకటి నుంచి కిరండూల్-విశాఖ పాసింజర్ రైళ్లు యథావిధిగా తిరుగుతాయన్నారు. అలాగే హౌరా-జగదల్‌పూర్ మధ్య సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (ఎగువ, దిగువ) ఆగస్టు 1 నుంచి, జగదల్‌పూర్-రూర్కెలా ఇంటర్‌సిటీ, జగదల్‌పూర్-భువనేశ్వర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లు గురువారం నుంచి రాకపోకలు సాగిస్తాయన్నారు.

పుస్తకావిష్కరణ

సీతంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కవి దాట్ల దేవదానం రాజు రాసిన కథా సంపుటి 'మనిషి లోపలి నీడ' పుస్తకాన్ని డాక్టర్ టి.రవిరాజు బుధవారం ఆవిష్కరించారు.

క్రికెట్ లీగ్ టోర్నీ విజేత సిటీ పోలీస్



చాంపియన్‌గా నిలిచిన సిటీ పోలీసు జట్టు సభ్యులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం (వీడీసీఏ) నిర్వహించిన వార్షిక ఇనిస్టిట్యూషనల్ లీగ్ టోర్నీలో సిటీ పోలీసు చాంపియన్‌గా నిలిచింది. బుధవారం వీడీసీఏ-బీ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్స్‌లో ఏపీఈపీడీసీఎల్‌పై 52 పరుగుల తేడాతో విజయం సాధించి చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సిటీ పోలీసు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 208 పరుగులు చేసింది. టి.రాజు విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగి 10 సిక్సర్లు, ఐదు బౌండరీలతో 96 పరుగులు చేసి సెంచరీ చేజారాడు. ఎం.సంతోష్ (43) రాణించి మంచి తోడ్పాటు అందించాడు. ఏపీఈపీడీసీఎల్ బౌలర్ కార్తీక్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. లక్ష్య ఛేదనలో ఏపీఈపీడీసీఎల్ 17.3 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. అభిషేక్ (40) మినహా మిగిలినవారు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. సిటీ పోలీసు బౌలర్లలో సురేష్ ఐదు వికెట్లు, త్రినాథ్ మూడు వికెట్లు పడగొట్టి ఏపీఈపీడీసీఎల్ బ్యాటింగ్‌ను దెబ్బతీసి జట్టుకు విజయాన్నందించారు.

రైల్వేలో సరుకు రవాణా పెంపుపై డీఆర్ఎం చర్చ

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సరుకు రవాణా వినియోగదారులు, వాటాదారులతో వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది. డీఆర్ఎం లలిత్ బొహ్రా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పరస్పర సహకారంతో కొత్త ఆదాయ మార్గాలు గుర్తించడం, సరుకు రవాణాపై సమన్వయ సహకారాలపై చర్చించారు. పరిశ్రమల డిమాండ్‌కు అనుగుణంగా అదనపు రేక్‌ను సమకూర్చడం, మౌలిక సదుపాయాలు కల్పించడం, రైల్వే సైడింగ్‌లో కార్యాచరణ నిర్వహణ, అడ్డంకులు తగ్గించుకోవడం, సమయపాలన నిర్వహణ, సమాచార వ్యవస్థను విస్తృతపరచడం వంటి అంశాలపై డీఆర్ఎం వివరించారు. సరుకు రవాణాను పెంచడానికి ఆధునిక వ్యూహాలను అన్వేషించాలని అధికారులు, వినియోగదారులు, వాటాదారులకు సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ డీవోఎం తన్మయ్ ముఖోపాధ్యాయ, సీనియర్ డీసీఎం కె.సందీప్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శక్తియాప్‌పై విద్యార్థినులకు అవగాహన

మహారాణిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కవచంగా ఉండే శక్తియాప్‌ను ఎలాంటి పరిస్థితుల్లో వినియోగించాలో వన్‌టౌన్ సీఐ జి.దేముడుబాబు కేజీహెచ్‌లో నర్సింగ్ విద్యార్థినులకు బుధవారం అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలపై జరిగే దాడులు, సైబర్ క్రైమ్ నుంచి శక్తియాప్ ద్వారా ఎలా రక్షణ పొందవచ్చునో వారికి వివరించారు.



నర్సింగ్ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ దేముడుబాబు

కానరాని శతాబ్ది సందడి

... 5వ పేజీ తరువాయి

అంటీ ముట్టనట్టుగానే ఉంటోంది. ఏటా డిసెంబరు పదో తేదీన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహిస్తుంటారు. ఈ వేడుకలను జీఎంఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని దేశంలోని ప్రముఖులను తీసుకుని వస్తున్నారు. ఈ వేడుకలకు రతన్ టాటా, ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. ఈ ఏడాది రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీని తీసుకురావాలని జీఎంఆర్ భావించారు. ఈ మేరకు వర్సిటీ అధికారులకు సమాచారాన్ని అందించారు. అయితే, వందేళ్ల వేడుకల్లో బిజీగా ఉంటామని తెలియజేయడంతో ఆయన ఆ ఆలోచనను విరమించుకున్నట్టు తెలిసింది. ప్రస్తుత పరిణామాల పట్ల ఏయూ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్యాంపస్‌లో శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్న వాతావరణం కాన రావడం లేదంటూ పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా వర్సిటీ అధికారులు వందేళ్ల వేడు కలపై దృష్టిసారిస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

కొన్ని రూట్లలో అచ్చంగా మహిళా కండక్టర్లు

... 5వ పేజీ తరువాయి

ద్వారకా బస్ కాంప్లెక్స్, పూర్ణామార్కెట్, వీఎస్ఈజెడ్, విశాఖ రైల్వేస్టేషన్, దువ్వాడ రైల్వే స్టేషన్ వంటి ప్రాంతాలకు ఎక్కువమంది మహిళలు వివిధ అవసరాల మీద బస్సుల్లో రాకపోకలు సాగించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం విశాఖ రీజియన్‌లో 388 మహిళా కండక్టర్లు ఉండగా, వారిలో కనీసం 200 మందినైనా ఈ రూట్లలో షెడ్యూలింగ్ చేయాలని ఆలోచిస్తున్నారు.

మరోసారి భూ సమీకరణ

... 5వ పేజీ తరువాయి

చర్చించడంతో ఆయా జిల్లాల్లో సమీకరించడానికి అనువైన భూములను గుర్తించి సమాచారం అందించారు. ఆ ప్రకారం వీఎంఆర్‌డీఏకు వాటిని అప్పగించాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆర్‌డీఓలు భూ సమీకరణ చేయాలని సూచించింది. అసైన్డ్ పట్టా ఉన్న రైతులకు ఎకరాకు 900 గజాలు, ఆ భూమిలో పదేళ్లకు పైగా ఆక్రమణలో ఉంటే 450 గజాలు అభివృద్ధి చేసిన భూమి ఇస్తారు. ల్యాండ్ పూలింగ్ కోసం 2016లో చేసిన చట్టం ప్రకారం ముందుకెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది.

విజయనగరం జిల్లాలో 25.41 ఎకరాలు.

- డెంకాడలో సర్వే నంబర్లు 241, 242, 243లలో 20.41 ఎకరాలు.
- భోగాపురం మండలం రావాడ సర్వే నంబరు 64/1లో 5 ఎకరాలు.

అనకాపల్లి జిల్లాలో 783.69 ఎకరాలు

- సబ్బవరం మండలం అంతకాపల్లిలో 175.42 ఎకరాలు
- బాటజంగాలపాలెంలో 141.01 ఎకరాలు
- ఎ.సిరసపల్లిలో 371.75 ఎకరాలు
- నాళ్ల రేగుడిపాలెంలో 27.37 ఎకరాలు
- పైడివాడ అగ్రహారంలో 28.14 ఎకరాలు
- అనకాపల్లి మండలం తగరంపూడిలో 40 ఎకరాలు

ఫార్మాసిటీలో వ్యర్థాల గుట్టలు

... 5వ పేజీ తరువాయి

ఏపీ పీసీబీ అధికారులు ఈ నెలలోనే నాలుగుసార్లు (12, 13, 17, 18 తేదీల్లో) తనిఖీలు చేశారు. అనేక లోపాలు గుర్తించారు. నిబంధనలు పాటించడం లేదని తేల్చారు. నోటీసులు జారీచేశారు. ల్యాండ్ ఫిల్ పాండ్‌లో వ్యర్థాలను తరలించేంత వరకు కొత్త వ్యర్థాలను తీసుకురాకూడదని హెచ్చరించారు. నిల్వ చేసిన వాటిని దూర ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. బూడిద నిల్వలపై టార్పాలిన్లు కప్పాలని, గాలికి ఎగరకుండా చూడాలని సూచించారు. అక్కడి వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటులోకి వచ్చే వాహనాలను శుభ్రం చేసేందుకు శాశ్వత ఏర్పాట్లు లేకపోవడాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనపై వివరణ ఇవ్వాలని నోటీసు జారీచేశారు. ఆ తరువాత యాజమాన్యాన్ని విచారణకు పిలిచి, ప్రభుత్వానికి నివేదిక పంపించి, తగిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

ఎన్‌జీటీలో కేసు

- విశాఖ ఫార్మా సిటీ కాలుష్యంపై స్థానిక ప్రజా సంఘాలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)లో కేసు వేశాయి. తానాం గ్రీన్ బెల్ట్‌లోని బఫర్ జోన్‌లో చెరువు తవ్వారని, అది నిబంధనలకు వ్యతిరేకమని ఆరోపించాయి.
- పరిశ్రమల రసాయన వ్యర్థాలను పరవాడలోని ముల్లేటి గెడ్డలోకి విడిచి పెడుతున్నారని, దానివల్ల తాగునీరు కలుషితం అవుతోందని ఫిర్యాదు చేశారు.
- తాడి గ్రామంలోని ల్యాండ్ ఫిల్ (వ్యర్థాలు నిల్వ చేసే పాండ్) పూర్తిగా నిండిపోయిందని, అనధికారికంగా నిల్వ చేస్తున్నారని పేర్కొన్నారు.

వీటన్నింటిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఏపీపీసీబీని ఎన్‌జీటీ ఆదేశించింది. అధికారులు నివేదిక సమర్పించగా, దానిపై ప్రస్తుతం వాదనలు జరుగుతున్నాయి. ఎన్‌జీటీలో కేసు ఉన్నా సరే విశాఖ ఫార్మా సిటీ యాజమాన్యం ఇప్పటికీ అవే తప్పులు చేయడం లెక్కలేనితనాన్ని రుజువు చేస్తున్నదని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు.

ఆడిట్ పేరుతో యూసీడీ దందా

... 5వ పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మెప్మా ఎండీ ఆధ్వర్యంలో రెండు సంస్థలకు ఆడిట్ బాధ్యతలను అప్పగించారు. ఆడిట్ చేసినందుకు ప్రతి సంఘం రూ.300 చొప్పున ఆ సంస్థకు చెల్లించాలని ఆదేశాలు జారీచేశారు. డబ్బులు వసూలుచేసే బాధ్యతను ఆ జోన్‌లోని ఏపీడీలు సంబంధిత వార్డు కమ్యూనిటీ ఆర్గనైజర్(సీఓ)లకు అప్పగించారు. గత నాలుగు రోజులుగా నగరంలో మహిళా సంఘాల రికార్డుల ఆడిట్ జరుగుతోంది. ఆడిట్ కోసం రూ.300 చొప్పున సంఘాల నుంచి వసూలు చేయాలని మెప్మా ఎండీ ఆదేశాలు జారీచేయగా, ఇదే అదనుగా కొందరు యూసీడీ అధికారులు, సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. ఒక్కో గ్రూపు నుంచి రూ.300కి బదులుగా, ఆడిట్ సిబ్బందికి భోజనం, వసతి ఖర్చులు పేరుతో రూ.200 అదనంగా వసూలు చేస్తున్నారు. వాస్తవంగా ఆడిట్ చేసేవారికి ఎలాంటి ఖర్చులు చెల్లించాల్సిన అవసరం లేదు. జీవీఎంసీ పరిధిలో 35 వేల సంఘాల నుంచి రూ.70 లక్షలు అదనంగా వసూలుచేసి వాటాలుగా పంచుకునేందుకు సిద్ధమయ్యారు. కొందరైతే నాలుగేళ్ల ఆడిట్ చేయాల్సి ఉందని చెప్పి రూ.రెండు వేలు వసూలు చేస్తున్నారు. దీనిపై యూసీడీ పీడీ సత్యవేణి వివరణ కోరగా సంఘాల ఆడిట్ జరుగుతోందని, అదనపు వసూళ్ల సంగతి తనకు తెలియదన్నారు. దీనిపై అన్నిజోన్‌ల ఏపీడీలు, ఆర్పీలు, సీఓలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలు ఇస్తానని తెలిపారు.

వీఎంఆర్‌డీఏ భూములపై ఐటీ కంపెనీల కన్ను

... 5వ పేజీ తరువాయి

రుషికొండ, మధురవాడ ప్రాంతాల్లో ఉండడంతో వాటిని తమకు కేటాయించాలని ఐటీ సంస్థలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. రుషికొండ ప్రాంతంలో వీఎంఆర్‌డీఏ రెండు కీలకమైన ఐకానిక్ ప్రాజెక్టులకు ప్రణాళిక రూపొందించింది. లా కాలేజీకి వెళ్లే మార్గంలో పనోరమ హిల్స్ వద్ద సుమారు 8.82 ఎకరాల విస్తీర్ణంలో ఢిల్లీ తరహాలో ఈస్ట్ కోస్ట్ హేబిటేట్ సెంటర్ నిర్మాణానికి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన ఈ ఏడాది మార్చిలో చేసింది. ఆఫీస్ స్పేస్, బిజినెస్ సెంటర్, ఆడిటోరియం, ఎగ్జిబిషన్ హాల్, బొటిక్, హోటల్, సర్వీస్ అపార్ట్‌మెంట్, ప్రీమియం క్లబ్, ఈవెంట్/పార్టీ లాన్స్, ఫైన్ డైన్ రెస్టారెంట్లు, స్పోర్ట్స్ సెంటర్, సూపర్ మార్కెట్ అందులో ఉంటాయి. ఈ ప్రాజెక్టుకు సుమారుగా రూ.460 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా. 33 ఏళ్ల లీజుకు ఇస్తారు. అదేవిధంగా విశాఖపట్నం పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి సాధించడానికి 'వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాల్టీ ఎరీనా అండ్ 3 స్టార్ హోటల్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. ఇది కూడా లా కాలేజీ మార్గంలో ఐకానికా గ్రాండ్ సమీపాన 2.82 ఎకరాల్లో వస్తుంది. 360 డిగ్రీల ఇమ్మెర్సివ్ థియేటర్, మిక్స్‌డ్ రియాల్టీ ఎస్కేప్ రూమ్, యానిమేషన్ షో, వీఆర్ గేమింగ్ జోన్, అక్వేరియం వంటి ఉంటాయి. డ్రైవ్-ఇన్ ఫుడ్ జోన్, 24/7 కేఫ్‌లు, 3 స్టార్ హోటల్ నిర్మిస్తారు.

మధురవాడ పరిసర ప్రాంతాల్లోని ఐటీ కంపెనీలు, అందులో పనిచేసే ఉద్యోగుల కుటుంబాల అవసరాల కోసం దీనిని డిజైన్ చేశారు. అయితే వీటికి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన చేస్తే...పలు సంస్థలు తాము ఐటీ కంపెనీలు పెట్టుకుంటామని, ఆయా భూములు తమకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం వద్దకు వెళ్లాయి. వీఎంఆర్‌డీఏ మాత్రం తమ వద్ద ఇంకా అనేక భూములు అదే ప్రాంతంలో ఉన్నాయని, వాటిని ఐటీ సంస్థలకు ఇస్తామని, వీటిలో మాత్రం ముందుగా పేర్కొన్న ప్రాజెక్టులనే చేపడతామని స్పష్టం చేసినట్టు తెలిసింది. అలా చేస్తేనే కొత్త ఐటీ కంపెనీలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని, ఆ ప్రాంతం మరింత అభివృద్ధి సాధిస్తుందని వీఎంఆర్‌డీఏ ప్రతినిధులు అమరావతి అధికారులకు చెప్పినట్టు సమాచారం.

ఎంఈవోలను కలిసిన ఏపీటీఎఫ్ కార్యవర్గం

అక్కయ్యపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ సీతమ్మధార మండల శాఖ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.దుర్గకుమారి, బలిరెడ్డి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు మండల విద్యాశాఖాధికారులు రామారావు, బాలామణిలను ఎన్‌జీజీఓస్ కాలనీలోని తమ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంఈవోలు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక అభిషేకాలకు బుక్ చేసుకునే అవకాశం

» సంపత్ వినాయగర్ ఆలయంలో ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 4 వరకు వినాయకచవితి ఉత్సవాలు



సిరిపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ సంపత్ వినాయగర్ స్వామి వినాయక చతుర్థి మహోత్సవాలను ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 4 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక సభ్యులు టీఆర్ చోళన్, ఈవో డీవీవీ ప్రసాదరావు తెలిపారు. చవిత నాడు ఉదయం 3 గంటలకు పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ ఉత్సవాల్లోని స్వామివారి ప్రత్యేక అభిషేకంలో పాల్గొనే నిమిత్తం ఈ నెల 31న ఉదయం 8.30 గంటల నుంచి ఉభయదాతలు వారి గోత్రనామాలతో పూజలు ముందుగా బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సేవలో పాల్గొనే నిమిత్తం రూ.2500 దేవస్థానం కౌంటర్‌లో చెల్లించి ఆన్‌లైన్ రసీదు పొందాలని కోరారు. ఈ సేవల్లో పాల్గొనే ఉభయ దాతలకు అభిషేకం అనంతరం శ్రీ స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు (పంచె, కండువా, చీర, జాకెట్) స్వామివారి అలంకరణ ఫోటో, తీర్థప్రసాదాలను ఆలయ అర్చకుల ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల ఆభయదాతలు పైన తెలిపిన ఉత్సవ రోజుల్లో అభిషేకం సేవలో పాల్గొన వచ్చని కోరారు.

వైద్య పరికరాల కొనుగోలు కోసం భిక్షాటన

» సీపీఎం వినూత్న నిరసన



భిక్షాటన చేస్తున్న సీపీఎం నేతలు

మహారాణిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లోని గుండె జబ్బుల వార్డులో వైద్య పరికరాల కొనుగోలుకు విరాళాలివ్వాలని కోరుతూ సీపీఎం భిక్షాటన చేసింది. ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బుధవారం కేజీహెచ్ , కలెక్టరేట్ జంక్షన్ వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ రెండుచోట్లకు వచ్చిన వారి వద్ద కేజీహెచ్‌లో గుండె జబ్బుల వార్డు దుస్థితిని వివరిస్తూ ఆర్థిక సాయం చేయండంటూ అర్థించారు. భిక్షం వేసి రాష్ట్ర ప్రభుత్వానికి కొంత తోడ్పాటు అందించాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ గుండె జబ్బుల వార్డులో వైద్య పరికరాలు మూలన పడ్డాయని, 7 నెలలుగా శస్త్రచికిత్సలు నిలిపివేయటం పేదలకు వైద్య సదుపాయం నుంచి దూరం చేయటమేనని ఆక్షేపించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు కాసులు కురిపించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. పేదలు ఆర్థిక స్థోమత లేక వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని, అలాంటి వారికి వైద్యం అందించకుండా ప్రభుత్వం, ఆసుపత్రి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

సినిమా గైడ్

- **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీవెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),
- **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు)32, బెండకాయలు 38, పచ్చిమిర్చి 66, కాకరకాయలు 30, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 36, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 66, బరబాటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 50, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 40, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

విశాఖలో మరింత పర్యాటక అభివృద్ధి

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జాయింట్ కమిషనర్ రమేష్ తదితరులు

బీచ్ రోడ్డు, జూలై 30, (ఆంధ్రజ్యోతి) : విశాఖను పర్యాటకపరంగా మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. శుద్ధి చేసే తాగునీటి సదుపాయాల యంత్రాలను బుధవారం ఆర్కే బీచ్ కురుసర సబ్‌మెరైన్ మ్యూజియం, టీయూ- 142 యుద్ధ విమానం మ్యూజియం వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీఎంఆర్డీఏ ద్వారా మౌలిక సదుపాయాల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. సుమారు రూ.30 లక్షలతో తాగునీటి శుద్ధి పరికరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సాగర తీరానికి పర్యాటకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోందని, వారికి మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖపట్నం అన్ని రంగాల్లో అభివృద్ధికి ఆస్కారం ఉన్న ప్రాంతమన్నారు. విశాఖకు ఉజ్వల భవిష్యత్తు ఉందని చెప్పారు. పర్యాటకంగా విశాఖ నగరానికి మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం పర్యాటకంగా ఎన్నో అభివృద్ధి పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు. వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విశాఖను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తోందని వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షణా ఇంజనీరు భవానీశంకర్, కార్యనిర్వాహక ఇంజి నీర్లు రామరాజు, దుర్గాప్రసాద్, దివీస్ ప్రతినిధులు కోటేశ్వరరావు, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

చాకలిపేటకు విద్యుత్ సరఫరా నిలిపివేతకు యత్నం

- » విద్యుత్ సిబ్బందిని ప్రతిఘటించిన రజకులు
- » పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామంటూ హెచ్చరిక
- » వెనుదిరిగిన విద్యుత్ శాఖ సిబ్బంది
- » ఇవన్నీ కార్పొరేటర్ కుతంత్రాలు అంటూ చాకలిపేట వాసుల ఆగ్రహం



కరెంట్ కట్ చేస్తే పెట్రోల్ పోసుకుంటానని విద్యుత్‌శాఖ సిబ్బందిని అడ్డుకుంటున్న స్థానికులు

మద్దిలపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ చాకలిపేటలో నివాసాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేసేందుకు బుధవారం విద్యుత్‌శాఖ సిబ్బంది రావడం తీవ్ర వివాదానికి దారితీసింది. సరఫరా నిలిపి వేస్తే ఆత్మహత్య చేసుకుంటామని బాధితులు బాటిల్స్‌తో పెట్రోల్ పట్టుకుని బెదిరించారు. అరవై ఏళ్ల నుంచి కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నాం, పన్నులు కడుతున్నాం, కోర్టు కూడా తమకు పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందని చెబుతూ అందుకు సంబంధించిన పత్రాలు అధికారులకు చూపించారు.

అయితే కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ తమకు పంపించారని, కోర్టు ఆర్డర్ ఉన్నా మాకు సంబంధం లేదు కరెంట్ కట్ చేస్తామని విద్యుత్ సిబ్బంది స్పష్టం చేయడంతో చాకలిపేట మహిళలు ఆందోళనకు దిగారు.

ఈ సందర్భంగా బాధితులు కనక శ్రీనులు మాట్లాడుతూ వాంబే గృహాలకు ఆనుకుని ఉన్న స్థలంలో అరవై ఏళ్లుగా పాకల ఇల్లు, దుకాణం నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ ఉండేందుకు కోర్టు కూడా పర్మినెంట్ ఇంజిక్షన్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఈ స్థలంపై పీతల మూర్తి యాదవ్ కన్ను పడిందని ఆరోపించారు. ఇక్కడ నాలుగు అంతస్తుల భవనం నిర్మించి మీకో ఫ్లోరు ఇచ్చి మూడు ఫ్లోరులు నేను తీసుకుంటానని ప్రతిపాదనలు పెట్టాడన్నారు. అందుకు అంగీకరించక పోవడంతో ముందు వాంబే గృహంలోని గోడ కూలగొట్టించారని ఆరోపించారు. వాంబే గృహాలకు వినియోగించే వాటర్ ట్యాంక్ పగలగొట్టడానికి మూర్తి యాదవ్ వస్తే అడ్డుకున్నామన్నారు.

దీంతో తమను ఏ విధంగానైనా ఖాళీ చేయించాలని నివాసాల ముందు రోడ్డు మార్గం తవ్వించారన్నారు. యాభై రోజులుగా తవ్విన గోతుల్లో బురద పేరుకుపోయి కంపుకు ఉండలేకపోతున్నామన్నారు. రోజూ మూర్తి యాదవ్ వచ్చి దుకాణం, పాక కూలగొడతానంటూ బెదిరించడంతో మా అమ్మ సింహాచలం ఒత్తిడికి గురై బీపీ పెరిగి భయంతో మృతి చెందిందన్నారు. అయినా మూర్తియాదవ్‌కు మాపై జాలి కలగలేదన్నారు. రెండు రోజుల నుంచి విద్యుత్ సిబ్బందికి పంపించి కరెంట్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారంటూ మండిపడ్డారు. పాకలో కాలు లేని వికలాంగుడు నివాసం ఉంటున్నాడని, పాక తీస్తే ఆయన పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అధికారులకు తప్పుడు సమాచారంతో తప్పుదోవ పట్టించి తమపై ఉసుగొల్పుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డులో మితిమీరుతున్న మూర్తియాదవ్ దౌర్జన్యాలు, రౌడీయిజంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన


» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



ఎమ్మెల్యేకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న స్థానికులు

మద్దిలపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 22వ వార్డులోని సిద్ధార్థనగర్, రేసపువానిపాలెం ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల యోగాక్షేమాలు తెలుసుకుంటున్నామన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు ఇప్పటికే చాలా అమలు చేశామని, మిగిలిన హామీలు త్వరలోనే అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో అన్నీ వర్గాల అభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయకులు బొట్టా నీలిమ, బొట్టా వెంకటరమణ, దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, రాజకుమార్, డేవిడ్, డొక్కరి శ్రీనివాస్, వెలగపూడి ప్రతాప్‌రుద్ర, డేవిడ్, రాజ్‌కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ పార్కును పరిశీలించిన చైర్మన్, కమిషనర్



పార్కులో సందర్శిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తదితరులు

పెదవాల్తేరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌బుధవారం వీఎంఆర్డీఏ పార్కును క్షేత్రస్థాయిలోఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాకర్స్, సందర్శకులతో కలిసి మాట్లాడారు. కొన్ని నిర్వహణపరమైన పనులు, మరమత్తులను 20 రోజుల్లో శతశాతం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కొన్ని పనులను ఇప్పటికే 90 శాతం పూర్తిచేశామని, అన్నిటిని పూర్తి చేసి మెరుగైన వసతులు కల్పిస్తామని చేప్పారు. పార్కు గతంలో కంటే నిర్వహణ బాగా ఉందని వాకర్స్ కొనియాడారు.ఈ పర్యటనలో ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ భవానీ శంకర్, డీఎఫ్‌వో సుజాతా శివానీ, కార్యనిర్వహక ఇంజనీర్లు రామరాజు, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ విజేతకు అభినందనలు



మహీధరవర్మను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ బోస్, డైరెక్టర్లు

ఎంవీపీ కాలనీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న ఒంగోలు, ప్రకాశం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్‌లు సంయుక్తంగా నిర్వహించిన అండర్-19 బాలుర విభాగంలో ఏపీ టేబుల్ టెన్నీస్ ర్యాంకింగ్ టోర్నమెంట్-2025లో ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ విద్యార్థి పి.మహీధర వర్మ ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేఎస్ బోస్, డైరెక్టర్ గిరిధర్‌లు.. మహీధర వర్మను అభినందించారు.

రా.వి.శాస్త్రి రచనలు సామాజిక జీవన ప్రతిబింబాలు

» జయంతి కార్యక్రమంలో వక్తలు



రా.వి.శాస్త్రికి నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, విద్యార్థులు

బీచ్ రోడ్డు, జులై 30, (ఆంధ్రజ్యోతి) : విశ్వనాథ శాస్త్రి తన రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేశారని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ పేర్కొన్నారు. బుధవారం ఆర్కే బీచ్ వద్ద ఉన్న రాచకొండ విశ్వనాథ శాస్త్రి మెమోరియల్ దగ్గర ఆయన జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ కలమే ఆయుధంగా బడుగు, బలహీనవర్గాల జీవన పోరాటానికి అక్షర రూపం ఇచ్చిన మహా మనిషి రాచకొండ విశ్వనాథ శాస్త్రి అని కొనియాడారు. న్యాయశాస్త్రంతో పాటు సాహిత్యంపై పట్టు ఉన్న శాస్త్రి సాధారణ ప్రజల జన జీవితాన్ని తన రచనల ద్వారా ప్రతిబింబించారన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎం.కె. శ్రీనివాస్, ప్రముఖ రచయిత డీవీ సూర్యారావు, ప్రముఖ న్యాయవాది కేవీ. రామ్మూర్తి, కేవీ నర్సింహమూర్తి, నమ్మి సన్యాసిరావు, సీఎస్ శేఖర్, చింతపల్లి రాంబాబు, బెవర సత్యనారాయణ, వేదుల సోమేశ్వరరావు, విద్యార్థులూాల్గొన్నారు.

అక్షర శిల్పి రావిశాస్త్రి..

వెంకోజీపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఏయూ తెలుగు విభాగాధ్యక్షులు ప్రొఫెసర్ జర్రా అప్పారావుఅధ్యక్షతన బుధవారం రావి శాస్త్రి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రావి శ్రాస్తి నవలాకారుడుగా, కథకుడుగా, నాటకకర్త, నాటికల రచియిత, గల్పికల రచయిత, లేఖల రచయిత, విమర్శకుడు, సంపాదకుడు, న్యాయ కోవిదుడుగా బహుముఖ ప్రతిభాశాలి అని కొనియాడారు. ఈయన కథలు విశ్వవిద్యాలయ స్థాయిలో సిలబస్‌లో కూడా పెట్టడం జరిగిందన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ తాను ఎన్నుకున్న మార్గంలో నిజాయితీగా, నిబద్ధతతో చివర వరకూ పయనించిన గొప్ప రచయిత రావిశాస్త్రి అని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్.గిరీష్‌కుమార్, డాక్టర్ ఆర్.శివయ్య, డాక్టర్ ఎం.దాసు, డాక్టర్ బీర సూర్యనారాయణ, డాక్టర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.కృష్ణవేణి పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏయూలో రావిశాస్త్రికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

బాలల అక్రమ రవాణా నిరోధంపై అవగాహన ర్యాలీ



బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్, డిస్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, అప్‌హోల్డ్ ఎన్జీవో బహుళ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్ర పంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం గా పాటించారు. దీనిలో భాగంగా బాలల అక్ర మ రవాణాపై అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండా లని సూచిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంత రం విశాఖ రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ, ఆర్పీఎఫ్, జిల్లా మహిళా, సంక్షేమ సంఘం, డీసీపీయూ, వైజాగ్ ఎన్జీవోస్ ఫోరం, స్టేషన్‌లోని వెంటర్స్ ప్రతినిధులుసదస్సు నిర్వహించి బాలలు, మహిళల అక్రమ రవాణాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ అక్రమ రవాణా నిరోధానికి సమన్వయం, సమష్టి కృషితో అంతర్గత సంస్థలు చర్యలు తీసుకోవలసిన అవసరాన్ని గుర్తించారు. అప్‌హోల్డ్ ఎన్జీవో విశాఖలో పిల్లల రక్షణ, హక్కులతోపాటు న్యాయం అందించడంలో చురుగ్గా పనిచేస్తోందన్నారు. పిల్లల రక్షణ చట్టాలను రూపొందించడంలో 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' సంస్థ గణనీయమైన పాత్ర పోషించిందని, 418 జిల్లాల్లో సుమారు 250 ఎన్జీవో సంస్థల భాగస్వామ్యంతో చురుగ్గా పనిచేస్తోందన్నారు. గత ఏడాదిలో బాల కార్మికులతోపాటు అక్రమ రవాణాకు గురైన 359 మందిని అప్‌హోల్డ్ ఎన్జీవో బహుళ సంస్థ రక్షించిందని, అలాగే బాల్య వివాహాలను అడ్డుకుందన్నారు.

విద్యా సంస్థలకు ప్రైవేటు సంస్థల సహకారం అభినందనీయం : కలెక్టర్



ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ హరింధర్ ప్రసాద్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

ఆరిలోవ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : విద్యాసంస్థలకు సహకారం అందించే విషయంలో ప్రైవేటు సంస్థలు, కంపెనీలు స్పందిస్తున్న తీరు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎంఎస్ఎన్ హరింధర్ ప్రసాద్ కొనియాడారు. జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయం ప్రాంగణంలో దివీస్ లేబరేటరీ (చిప్పాడ) సామాజిక బాధ్యతలో భాగంగా సుమారు 22.60 లక్షలతో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ భవన నిర్మాణానికి సహకరించిన దివీస్ లేబరేటర్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. గత సంవత్సరం భీమిలి మండలం పరిధిలో పదో తరగతిలో వెనుక బడిన విద్యార్థులకు దివీస్ సంస్థ స్టడీ మెటీరియల్‌ను అందించారని, పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో మూడో స్థానంలో విశాఖ జిల్లా నిలిచేందుకు ఇది కొంతవరకు దోహదపడిందన్నారు. అడిగిన వెంటనే తమ సామాజిక బాధ్యతగా నిధులు అందించిన దివీస్ యాజమాన్య ఔదార్యం గొప్పదన్నారు.

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ.. విశాఖ జిల్లాలోని పాఠశాల విద్యకు మౌలిక సదుపాయాల కల్పనలో ప్రైవేటు సంస్థల పాత్ర అభినందనీయమని ప్రశంసించారు. ఈ భవన నిర్మాణానికి నిధులు అందజేసిన దివీస్ లేబరేటరీ యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో ప్రైవేటు సంస్థలు ఉదారత ప్రదర్శిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఉత్తరాంధ్ర గ్రాడుయేట్స్ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఈ శిక్షణా కేంద్రాని చక్కగా వినియోగించుకొని తద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలన్నారు. పదో తరగతి ఫలితాల్లో విశాఖ జిల్లా రాష్ట్రంలో అత్యున్నత స్థానంలో ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. 'దివీస్' జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ కంపెనీ ఎల్లప్పుడూ విద్యాపరమైన అంశాలకు ప్రాధాన్యం ఇస్తుదన్నారు. పాఠశాలల అభివృద్ధికి తమ వంతుగా సహకారం అందిస్తామన్నారు.

అన్న క్యాంటీన్‌లో ఆకస్మిక తనిఖీ



అన్న క్యాంటిన్‌కు వచ్చిన వారితో మాట్లాడుతున్న సీఎంహెచ్‌వో నరేశ్‌కుమార్, జడ్సీ-2 కనకమహాలక్ష్మి

ఆరిలోవ/ ఎంవీపీ కాలనీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్‌కు సమీపంలో విమ్స్ ఆస్పత్రికి ఎదురుగా బీఆర్టీఎస్ రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ను బుధవారం ఉదయం జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న వారితో మాట్లాడి ఫుడ్ ఎలా ఉందంటూ ఆరా తీశారు. వారు కూడా అక్కడే టిఫిన్ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంటిన్ పరిసరాలను పరిశీలించారు. శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని క్యాంటిన్ సిబ్బందిని సూచించారు. అలాగే ఎంవీపీ కాలనీలోని రైతు బజారు పక్కనున్న అన్న క్యాంటీన్‌ను జీఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ బుధవారం రాత్రి సందర్శించారు.

సకాలంలో గుర్తిస్తే గర్భాశయ క్యాన్సర్‌కు చెక్



గర్భాశయ క్యాన్సర్‌పై పోస్టర్ ఆవిష్కరిస్తున్న అపోలో వైద్య బృందం

ఆరిలోవ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు సోకే గర్భాశయ క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే నయం చేయడం సాధ్యమేనని అపోలో వైద్య బృందం తెలిపారు. బుధవారం ఆరిలోవ హెల్త్ సిటీలో గల అపోలో వైద్యశాలలో బుధవారం గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సైలెంట్‌కిల్లర్‌గా చెప్పబడే అండాశయ క్యాన్సర్ 55 నుంచి 64 ఏళ్ల వయసులో ఉన్న మహిళలకు అధికంగా వస్తుందన్నారు. సమావేశంలో డాక్టర్లు సుమన్‌దాస్, ఎంపీ చంద్రకల్యాణ్ సౌధామణి, శ్రీదేవి, సీవోవో కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మాధవధార, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మాధవధార ఎన్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆగస్టు 1న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ మాధవధార ఫీడర్ నుంచి సరఫరా అయ్యే ఆర్టీఏ కార్యాలయ ప్రాంతాలు, ఆర్టీఏ కార్యాలయం వెనుక ఎస్.ఆర్.నగర్, ఎయిర్‌పోర్ట్ పోలీసు స్టేషన్ ఏరియా, 286, 289 మాధవధార ఉడాకాలనీ సచివాలయం ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు. ఎన్ఏడీ కొత్తరోడ్డు, కాకానినగర్, పంజాబీ ధాబా, ఐఎన్ఎస్ డేగా ఏరియాల్లో సరఫరాకు అంతరాయడం కలుగుతుందన్నారు. 11 కేవీ కాకానినగర్ ఫీడర్ పరిధిలోని నివాసిత ప్రాంతాలు, రెల్లి వీధి, వినోద్‌నగర్, విమాన్ నగర్, ఎస్.వి.కె.నగర్ ప్రాంతాలకు సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఏర్పడనుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేసి చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నట్లు ఈఈ తెలియజేశారు.

త్వరలో వైసీపీ నాయకుల జాతకాలు బయటపెడతాం

▸ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్

మహారాణిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తున్న వైసీపీ నాయకులు వాసుపల్లి గణేష్‌కుమార్, కె.కె.రాజు తదితరుల జాతకాలు త్వరలోనే బయటపడతాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. స్థానిక వైసీపీ నాయకులు చేసిన పాపాలు తెలుగుదేశం మరచిపోలేదని అందరికీ తగిన గుణపాఠం చెపుతామని అన్నారు. తెలుగుదేశంలో అవినీతి, తప్పులు చేసిన నాయకులు ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. ఆరోపణలు నిరూపణ అయితే పార్టీ కఠిన చర్యలు తీసుకుంటుందని, అంతేకాని తమ నాయకునిపై నచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని నజీర్ హెచ్చరించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలన నయవంచనకు మారు పేరు అని వ్యాఖ్యానించారు. నాసిరకం మద్యం విక్రయించి ఆ పార్టీ నాయకులు కోట్ల రూపాయలు కొల్లగొట్టారని, చిన్న నాయకుడి వద్ద రూ.11 కోట్లు హవాలా డబ్బు బయటపడిందంటే పెద్ద నాయకులు ఎన్ని వేల కోట్ల రూపాయలు వెనకేసుకున్నారో అర్థమవుతుందన్నారు.

పారిశుధ్య నిర్వహణపై కలెక్టర్ ఆరా

అల్లిపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. బుధవారం వార్డు పరిధిలోని నేరెళ్ల కోనేరు, సీపీఐ కార్యాలయం, ఏడుగుళ్లు, అల్లిపురం మార్కెట్ ప్రాంతాల్లో కార్పొరేటర్ కందుల నాగరాజుతో కలసి పర్యటించారు. ప్రజల సమస్యలను, పారిశుధ్య నిర్వహణ తీరును, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సీపీఐ కార్యాలయం వద్ద ఆటో మరమ్మతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, డ్రగ్స్, గంజాయి సేవించేవారు ఎక్కువయ్యారని, ఈ సమస్య పరిష్కరించాలని కార్పొరేటర్, స్థానికులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌ను కలెక్టరు కోరారు. చలువతోటలో నిర్మిస్తున్న కల్యాణమండపం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈఎన్‌వీ నరేష్, జడ్సీ మల్లయ్యనాయుడు, ఏఎంహెచ్‌ఓ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



32వ వార్డులో పర్యటిస్తున్న కలెక్టరు హరేంధిర ప్రసాద్, కార్పొరేటర్ కందుల నాగరాజు తదితరులు

జోనల్ కమిషనర్ తనిఖీలు

డాబాగార్డెన్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి చెత్త సేకరణపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించాలని జోనల్ 4 కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు పేర్కొన్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని లలితాకాలనీ, గొల్లలపాలెం తదితర ప్రాంతాల్లో ఆయన బుధవారం విస్తృతంగా పర్యటించారు. గొల్లలపాలెం, లలితకాలనీ వాసులతో మాట్లాడి చెత్త సేకరించడానికి పారిశుధ్య సిబ్బంది ఇంటికి వస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. కాలువల్లో పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. లలితాకాలనీలోని పార్కులను శుభ్రంగా ఉంచాలన్నారు. డాబాగార్డెన్స్ ప్రాంతంలో వాణిజ్య సముదాయాల వారు రోడ్లపై చెత్త వేస్తే అపరాధ రుసుము వసూలు చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ కవర్లు ఎవరు వాడకుండా, అల్పాహారం, కూరగాయలు విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి అపరాధ రుసుము వసూలు చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలను ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.కామేశ్వరరెడ్డి, సెక్రటరీలు, మేస్త్రీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



లలితాకాలనీ పార్కులో పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

వివిధ కంపెనీలతో బీఎస్‌ఎన్‌ఎల్ ఒప్పందాలు



ఒప్పంద ప్రతులు చూపుతున్న బీఎస్ఎన్ఎల్ అధికారులు, వివిధ కంపెనీల డైరెక్టర్లు

డాబాగార్డెన్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ 'కౌసలం' ప్రాజెక్టులో భాగంగా 8 కంపెనీలతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు బీఎస్ఎన్ఎల్ పీజీఎం పాల్ వినియం తెలిపారు. డాబాగార్డెన్స్ జనరల్ మేనేజర్ కార్యాలయంలోని ఆయా కంపెనీలకు చెందిన డైరెక్టర్లతో కలిసి ఒప్పందంపై సంతకాలు చేశామన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ టెక్నాలజీ పరంగా ఆయా కంపెనీలతో కలిసి పనిచేస్తుందన్నారు.ఇప్పటికే అమల్లో ఉన్న సాంకేతికతను మరింతగా మెరుగుపర్చేందుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ పీజీఎం ఆపరేషన్ జి.ఆడమ్, ఎం.సత్యప్రసాద్, బి.ఎస్.శ్రీనివాస్, ఆయా కంపెనీల డైరెక్టర్లు, టీమ్ లీడర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు

జ్ఞానాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పునీతుపేతు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ఆగస్టు 1 నుంచి 15 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు విచారణకర్త ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు. జ్ఞానాపురం చర్చి ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహోత్సవాలకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. 1న దివ్యబలిపూజ అనంతరం సిలువగుర్తు మండపంలో పీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్ పతాక ఆవిష్కరణతో ఉత్సవం ప్రారంభమవుతుందన్నారు. 14వరకు రోజూ జపమాల, దివ్యపూజ, పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. 6 నుంచి 14 వరకు నవదిన ప్రార్థనలు, 15న ప్రధాన ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఫాదర్‌లు విమల్‌రాజ్, ప్రేమ్‌కుమార్, మరియరత్నం, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

ఆసియా రోలర్ స్కేటింగ్ టోర్నీలో పతకాలు



పతకాలు సాధించిన దినేష్, క్షేత్ర, సంహిత

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నగర స్కేటర్లు దినేష్, శివకోటి క్షేత్ర, సాయి సంహిత పతకాలు సాధించారు. దక్షిణ కొరియాలో జరిగిన ఈ టోర్నీ పెయిర్ డ్యాన్స్ ఈవెంట్‌లో శివకోటి క్షేత్ర అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించి రజత పతకం కైవసం చేసుకుంది. గొలగాని దినేష్ పెయిర్ డ్యాన్స్‌లో రెండు రజత పతకాలు, సాయి సంహిత ఒక స్వర్ణం, రజత పతకాలు సాధించారు. భారత జట్టుకు కోచ్‌గా విశాఖకు చెందిన పి.సత్యనారాయణ (సత్యం) వ్యవహరించారు. కోచ్‌లు, నిపుణులు సంతోషం వ్యక్తంచేశారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణకు చర్యలు

▸ వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణకు ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయం నుంచి రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో 30, 45, 27లకు లోబడి అభ్యంతరం లేని భూముల్లో 2019 అక్టోబరు 31వ తేదీలోపు ఇళ్లు నిర్మించుకున్న వారు తమ పరిధిలోని సచివాలయంలో డిసెంబరు 31లోగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గుడిసెలు, పూరిళ్లకు కూడా ఈ జీవోలు వర్తిస్తాయని, రెండేళ్ల తరువాత యాజమాన్య హక్కులు కల్పిస్తామన్నారు.150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారు 151 నుంచి 300 గజాల వరకు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం, ఎగువనున్న వారు మొత్తం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవ్వ కుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

మహారాణిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మెరైన్ పోలీసులు తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కోస్టల్ సెక్యూరిటీ పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సముద్రంలో లోపలకు వెళ్లకుండా నిరోధించేందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. తుపానులు, అల్పపీడన సమయాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా, వారి సమాచారాన్ని అందించే ట్రాన్స్‌పాండర్‌ల కు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. రుషికొండ మెరైన్ పోలీసు స్టేషన్ వద్ద రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని, కానిస్టేబుళ్లు, హోంగార్డుల నియామకానికి చర్యలు తీసుకోవాలని మెరైన్ అధికారులు కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో మెరైన్ పోలీసు, కస్టమ్స్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు కేజీహెచ్‌లో ఓపీ సేవలు

మహారాణిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో రోజూ సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య వయో వృద్ధులకు ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నట్లు ఆర్ఎంవో డాక్టర్ బంగారయ్య తెలిపారు. వయో వృద్ధుల సమస్యలపై కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుర్తు తెలియని వ్యక్తులు, భిక్షాటన చేసుకునేవారు అనారోగ్యంతో వస్తే ప్రత్యేక వార్డులో సేవలందిస్తున్నామని, ఈ సేవల విస్తృతికి యంత్రాంగం సహాయం, సహాయకులను కేటాయించాలని కోరారు.

అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ డైరెక్టర్‌గా ఆకుల జైఆంధ్ర

మహారాణిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ డైరెక్టర్‌గా ఆకుల జైఆంధ్ర నియమితులయ్యారు. బుధవారం జరిగిన కమిటీ సమావేశంలో కార్యవర్గ సభ్యులను నియమించారు. కేజీహెచ్ ఉద్యోగి అయిన జైఆంధ్ర నగర రెల్లికుల అధ్యక్షుడిగా ఉన్నారు.

భర్తపై వేడి నీళ్లు పోసిన భార్య

భీమునిపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : భర్తపై కోపంతో ఓ భార్య మరుగుతున్న వేడి నీళ్లను అతని శరీరంపై పోసి, తీవ్రంగా గాయపర్చింది. పట్టణం లోని నేరేళ్లవలస కాలనీలో మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. 4వ వార్డు నేరేళ్లవలస కాలనీలో దినసరి కూలీ నందిక కృష్ణ (30), భార్య గౌతమితో కలిసి నివశిస్తున్నారు. గౌతమి అత నికి మేనమామ కుమార్తె. ఎనిమిదేళ్ల క్రితం వివాహం కాగా మూడేళ్ల కుమార్తె ఉంది. మనస్పర్థల వల్ల ఇద్దరూ తరచూ గొడవలు పడుతుంటారు. ఇటీవల గౌతమి గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోగా పెద్దలు రాజీ కుదుర్చ మూడు రోజుల క్రితం భర్త వద్దకు తీసుకువచ్చారు. మంగళవారం రాత్రి గాఢ నిద్రలో వున్న కృష్ణపై ఆమె వేడి నీళ్లు తీసుకువచ్చి ముఖంపై, ఛాతిపై పోసింది. శరీరం కాలిపోవడంతో కృష్ణ గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల నివాసితులు వచ్చి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాధాకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేకే లైనులో రైళ్ల పునరుద్ధరణ

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కేకే (కొత్తవలస-కిరండూల్) లైనులో గురువారం నుంచి రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగిస్తాయని విశాఖపట్నం సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. కొన్ని రోజులుగా రైళ్ల గమ్యాలు కుదించిన విషయం తెలిసిందే. గురువారం నుంచి కిరండూల్-విశాఖ రాత్రి ఎక్స్‌ప్రెస్, విశాఖ-కిరండూల్ పాసింజర్, ఆగస్టు ఒకటి నుంచి కిరండూల్-విశాఖ పాసింజర్ రైళ్లు యథావిధిగా తిరుగుతాయన్నారు. అలాగే హౌరా-జగదల్‌పూర్ మధ్య సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (ఎగువ, దిగువ) ఆగస్టు 1 నుంచి, జగదల్‌పూర్-రూర్కెలా ఇంటర్‌సిటీ, జగదల్‌పూర్-భువనేశ్వర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లు గురువారం నుంచి రాకపోకలు సాగిస్తాయన్నారు.

పుస్తకావిష్కరణ

సీతంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కవి దాట్ల దేవదానం రాజు రాసిన కథా సంపుటి 'మనిషి లోపలి నీడ' పుస్తకాన్ని డాక్టర్ టి.రవిరాజు బుధవారం ఆవిష్కరించారు.

క్రికెట్ లీగ్ టోర్నీ విజేత సిటీ పోలీస్



చాంపియన్‌గా నిలిచిన సిటీ పోలీసు జట్టు సభ్యులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం (వీడీసీఏ) నిర్వహించిన వార్షిక ఇనిస్టిట్యూషనల్ లీగ్ టోర్నీలో సిటీ పోలీసు చాంపియన్‌గా నిలిచింది. బుధవారం వీడీసీఏ-బీ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్స్‌లో ఏపీఈపీడీసీఎల్‌పై 52 పరుగుల తేడాతో విజయం సాధించి చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సిటీ పోలీసు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 208 పరుగులు చేసింది. టి.రాజు విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగి 10 సిక్సర్లు, ఐదు బౌండరీలతో 96 పరుగులు చేసి సెంచరీ చేజారాడు. ఎం.సంతోష్ (43) రాణించి మంచి తోడ్పాటు అందించాడు. ఏపీఈపీడీసీఎల్ బౌలర్ కార్తీక్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. లక్ష్య ఛేదనలో ఏపీఈపీడీసీఎల్ 17.3 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. అభిషేక్ (40) మినహా మిగిలినవారు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. సిటీ పోలీసు బౌలర్లలో సురేష్ ఐదు వికెట్లు, త్రినాథ్ మూడు వికెట్లు పడగొట్టి ఏపీఈపీడీసీఎల్ బ్యాటింగ్‌ను దెబ్బతీసి జట్టుకు విజయాన్నందించారు.

రైల్వేలో సరుకు రవాణా పెంపుపై డీఆర్ఎం చర్చ

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సరుకు రవాణా వినియోగదారులు, వాటాదారులతో వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది. డీఆర్ఎం లలిత్ బోహ్రా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పరస్పర సహకారంతో కొత్త ఆదాయ మార్గాలు గుర్తించడం, సరుకు రవాణాపై సమన్వయ సహకారాలపై చర్చించారు. పరిశ్రమల డిమాండ్‌కు అనుగుణంగా అదనపు రేక్‌ను సమకూర్చడం, మౌలిక సదుపాయాలు కల్పించడం, రైల్వే సైడింగ్‌లో కార్యాచరణ నిర్వహణ, అడ్డంకులు తగ్గించుకోవడం, సమయపాలన నిర్వహణ, సమాచార వ్యవస్థను విస్తృతపరచడం వంటి అంశాలపై డీఆర్ఎం వివరించారు. సరుకు రవాణాను పెంచడానికి ఆధునిక వ్యూహాలను అన్వేషించాలని అధికారులు, వినియోగదారులు, వాటాదారులకు సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ డీవోఎం తన్మయ్ ముఖోపాధ్యాయ, సీనియర్ డీసీఎం కె.సందీప్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శక్తియాప్‌పై విద్యార్థినులకు అవగాహన

మహారాణిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కవచంగా ఉండే శక్తియాప్‌ను ఎలాంటి పరిస్థితుల్లో వినియోగించాలో వన్‌టౌన్ సీఐ జి.దేముడుబాబు కేజీహెచ్‌లో నర్సింగ్ విద్యార్థినులకు బుధవారం అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలపై జరిగే దాడులు, సైబర్ క్రైమ్ నుంచి శక్తియాప్ ద్వారా ఎలా రక్షణ పొందవచ్చునో వారికి వివరించారు.



నర్సింగ్ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ దేముడుబాబు

కానరాని శతాబ్ది సందడి

... 5వ పేజీ తరువాయి

అంటీ ముట్టనట్టుగానే ఉంటోంది. ఏటా డిసెంబరు పదో తేదీన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహిస్తుంటారు. ఈ వేడుకలను జీఎంఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని దేశంలోని ప్రముఖులను తీసుకుని వస్తున్నారు. ఈ వేడుకలకు రతన్ టాటా, ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. ఈ ఏడాది రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీని తీసుకురావాలని జీఎంఆర్ భావించారు. ఈ మేరకు వర్సిటీ అధికారులకు సమాచారాన్ని అందించారు. అయితే, వందేళ్ల వేడుకల్లో బిజీగా ఉంటామని తెలియజేయడంతో ఆయన ఆ ఆలోచనను విరమించుకున్నట్టు తెలిసింది. ప్రస్తుత పరిణామాల పట్ల ఏయూ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్యాంపస్‌లో శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్న వాతావరణం కాన రావడం లేదంటూ పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా వర్సిటీ అధికారులు వందేళ్ల వేడు కలపై దృష్టిసారిస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

కొన్ని రూట్లలో అచ్చంగా మహిళా కండక్టర్లు

... 5వ పేజీ తరువాయి

ద్వారకా బస్ కాంప్లెక్స్, పూర్ణామార్కెట్, వీఎస్ఈజెడ్, విశాఖ రైల్వేస్టేషన్, దువ్వాడ రైల్వే స్టేషన్ వంటి ప్రాంతాలకు ఎక్కువమంది మహిళలు వివిధ అవసరాల మీద బస్సుల్లో రాకపోకలు సాగించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం విశాఖ రీజియన్‌లో 388 మహిళా కండక్టర్లు ఉండగా, వారిలో కనీసం 200 మందినైనా ఈ రూట్లలో షెడ్యూలింగ్ చేయాలని ఆలోచిస్తున్నారు.

మరోసారి భూ సమీకరణ

... 5వ పేజీ తరువాయి

చర్చించడంతో ఆయా జిల్లాల్లో సమీకరించడానికి అనువైన భూములను గుర్తించి సమాచారం అందించారు. ఆ ప్రకారం వీఎంఆర్‌డీఏకు వాటిని అప్పగించాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆర్‌డీఓలు భూ సమీకరణ చేయాలని సూచించింది. అసైన్డ్ పట్టా ఉన్న రైతులకు ఎకరాకు 900 గజాలు, ఆ భూమిలో పదేళ్లకు పైగా ఆక్రమణలో ఉంటే 450 గజాలు అభివృద్ధి చేసిన భూమి ఇస్తారు. ల్యాండ్ పూలింగ్ కోసం 2016లో చేసిన చట్టం ప్రకారం ముందుకెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది.

విజయనగరం జిల్లాలో 25.41 ఎకరాలు.

- డెంకాడలో సర్వే నంబర్లు 241, 242, 243లలో 20.41 ఎకరాలు.
- భోగాపురం మండలం రావాడ సర్వే నంబరు 64/1లో 5 ఎకరాలు.

అనకాపల్లి జిల్లాలో 783.69 ఎకరాలు

- సబ్బవరం మండలం అంతకాపల్లిలో 175.42 ఎకరాలు
- బాటజంగాలపాలెంలో 141.01 ఎకరాలు
- ఎ.సిరసపల్లిలో 371.75 ఎకరాలు
- నాళ్ల రేగుడిపాలెంలో 27.37 ఎకరాలు
- పైడివాడ అగ్రహారంలో 28.14 ఎకరాలు
- అనకాపల్లి మండలం తగరంపూడిలో 40 ఎకరాలు

ఫార్మాసిటీలో వ్యర్థాల గుట్టలు

... 5వ పేజీ తరువాయి

ఏపీ పీసీబీ అధికారులు ఈ నెలలోనే నాలుగుసార్లు (12, 13, 17, 18 తేదీల్లో) తనిఖీలు చేశారు. అనేక లోపాలు గుర్తించారు. నిబంధనలు పాటించడం లేదని తేల్చారు. నోటీసులు జారీచేశారు. ల్యాండ్ ఫిల్ పాండ్‌లో వ్యర్థాలను తరలించేంత వరకు కొత్త వ్యర్థాలను తీసుకురాకూడదని హెచ్చరించారు. నిల్వ చేసిన వాటిని దూర ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. బూడిద నిల్వలపై టార్పాలిన్లు కప్పాలని, గాలికి ఎగరకుండా చూడాలని సూచించారు. అక్కడి వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటులోకి వచ్చే వాహనాలను శుభ్రం చేసేందుకు శాశ్వత ఏర్పాట్లు లేకపోవడాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనపై వివరణ ఇవ్వాలని నోటీసు జారీచేశారు. ఆ తరువాత యాజమాన్యాన్ని విచారణకు పిలిచి, ప్రభుత్వానికి నివేదిక పంపించి, తగిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

ఎన్‌జీటీలో కేసు

- విశాఖ ఫార్మా సిటీ కాలుష్యంపై స్థానిక ప్రజా సంఘాలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)లో కేసు వేశాయి. తానాం గ్రీన్ బెల్ట్‌లోని బఫర్ జోన్‌లో చెరువు తవ్వారని, అది నిబంధనలకు వ్యతిరేకమని ఆరోపించాయి.
- పరిశ్రమల రసాయన వ్యర్థాలను పరవాడలోని మొల్లేటి గెడ్డలోకి విడిచి పెడుతున్నారని, దానివల్ల తాగునీరు కలుషితం అవుతోందని ఫిర్యాదు చేశారు.
- తాడి గ్రామంలోని ల్యాండ్ ఫిల్ (వ్యర్థాలు నిల్వ చేసే పాండ్) పూర్తిగా నిండిపోయిందని, అనధికారికంగా నిల్వ చేస్తున్నారని పేర్కొన్నారు.

వీటన్నింటిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఏపీపీసీబీని ఎన్‌జీటీ ఆదేశించింది. అధికారులు నివేదిక సమర్పించగా, దానిపై ప్రస్తుతం వాదనలు జరుగుతున్నాయి. ఎన్‌జీటీలో కేసు ఉన్నా సరే విశాఖ ఫార్మా సిటీ యాజమాన్యం ఇప్పటికీ అవే తప్పులు చేయడం లెక్కలేనితనాన్ని రుజువు చేస్తున్నదని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు.

ఆడిట్ పేరుతో యూసీడీ దందా

... 5వ పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మెప్మా ఎండీ ఆధ్వర్యంలో రెండు సంస్థలకు ఆడిట్ బాధ్యతలను అప్పగించారు. ఆడిట్ చేసినందుకు ప్రతి సంఘం రూ.300 చొప్పున ఆ సంస్థకు చెల్లించాలని ఆదేశాలు జారీచేశారు. డబ్బులు వసూలుచేసే బాధ్యతను ఆ జోన్‌లోని ఏపీడీలు సంబంధిత వార్డు కమ్యూనిటీ ఆర్గనైజర్(సీఓ)లకు అప్పగించారు. గత నాలుగు రోజులుగా నగరంలో మహిళా సంఘాల రికార్డుల ఆడిట్ జరుగుతోంది. ఆడిట్ కోసం రూ.300 చొప్పున సంఘాల నుంచి వసూలు చేయాలని మెప్మా ఎండీ ఆదేశాలు జారీచేయగా, ఇదే అదనుగా కొందరు యూసీడీ అధికారులు, సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. ఒక్కో గ్రూపు నుంచి రూ.300కి బదులుగా, ఆడిట్ సిబ్బందికి భోజనం, వసతి ఖర్చులు పేరుతో రూ.200 అదనంగా వసూలు చేస్తున్నారు. వాస్తవంగా ఆడిట్ చేసేవారికి ఎలాంటి ఖర్చులు చెల్లించాల్సిన అవసరం లేదు. జీవీఎంసీ పరిధిలో 35 వేల సంఘాల నుంచి రూ.70 లక్షలు అదనంగా వసూలుచేసి వాటాలుగా పంచుకునేందుకు సిద్ధమయ్యారు. కొందరైతే నాలుగేళ్ల ఆడిట్ చేయాల్సి ఉందని చెప్పి రూ.రెండు వేలు వసూలు చేస్తున్నారు. దీనిపై యూసీడీ పీడీ సత్యవేణి వివరణ కోరగా సంఘాల ఆడిట్ జరుగుతోందని, అదనపు వసూళ్ల సంగతి తనకు తెలియదన్నారు. దీనిపై అన్నిజోన్‌ల ఏపీడీలు, ఆర్పీలు, సీఓలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలు ఇస్తానని తెలిపారు.

వీఎంఆర్‌డీఏ భూములపై ఐటీ కంపెనీల కన్ను

... 5వ పేజీ తరువాయి

రుషికొండ, మధురవాడ ప్రాంతాల్లో ఉండడంతో వాటిని తమకు కేటాయించాలని ఐటీ సంస్థలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. రుషికొండ ప్రాంతంలో వీఎంఆర్‌డీఏ రెండు కీలకమైన ఐకానిక్ ప్రాజెక్టులకు ప్రణాళిక రూపొందించింది. లా కాలేజీకి వెళ్లే మార్గంలో పనోరమ హిల్స్ వద్ద సుమారు 8.82 ఎకరాల విస్తీర్ణంలో ఢిల్లీ తరహాలో ఈస్ట్ కోస్ట్ హేబిటేట్ సెంటర్ నిర్మాణానికి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన ఈ ఏడాది మార్చిలో చేసింది. ఆఫీస్ స్పేస్, బిజినెస్ సెంటర్, ఆడిటోరియం, ఎగ్జిబిషన్ హాల్, బొటిక్, హోటల్, సర్వీస్ అపార్ట్‌మెంట్, ప్రీమియం క్లబ్, ఈవెంట్/పార్టీ లాన్స్, ఫైన్ డైన్ రెస్టారెంట్లు, స్పోర్ట్స్ సెంటర్, సూపర్ మార్కెట్ అందులో ఉంటాయి. ఈ ప్రాజెక్టుకు సుమారుగా రూ.460 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా. 33 ఏళ్ల లీజుకు ఇస్తారు. అదేవిధంగా విశాఖపట్నం పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి సాధించడానికి 'వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాల్టీ ఎరీనా అండ్ 3 స్టార్ హోటల్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. ఇది కూడా లా కాలేజీ మార్గంలో ఐకానికా గ్రాండ్ సమీపాన 2.82 ఎకరాల్లో వస్తుంది. 360 డిగ్రీల ఇమ్మెన్సివ్ థియేటర్, మిక్స్‌డ్ రియాల్టీ ఎస్కేప్ రూమ్, యానిమేషన్ షో, వీఆర్ గేమింగ్ జోన్, అక్వేరియం వంటి ఉంటాయి. డ్రైవ్-ఇన్ ఫుడ్ జోన్, 24/7 కేఫ్‌లు, 3 స్టార్ హోటల్ నిర్మిస్తారు.

మధురవాడ పరిసర ప్రాంతాల్లోని ఐటీ కంపెనీలు, అందులో పనిచేసే ఉద్యోగుల కుటుంబాల అవసరాల కోసం దీనిని డిజైన్ చేశారు. అయితే వీటికి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన చేస్తే...పలు సంస్థలు తాము ఐటీ కంపెనీలు పెట్టుకుంటామని, ఆయా భూములు తమకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం వద్దకు వెళ్లాయి. వీఎంఆర్‌డీఏ మాత్రం తమ వద్ద ఇంకా అనేక భూములు అదే ప్రాంతంలో ఉన్నాయని, వాటిని ఐటీ సంస్థలకు ఇస్తామని, వీటిలో మాత్రం ముందుగా పేర్కొన్న ప్రాజెక్టులనే చేపడతామని స్పష్టం చేసినట్టు తెలిసింది. అలా చేస్తేనే కొత్త ఐటీ కంపెనీలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని, ఆ ప్రాంతం మరింత అభివృద్ధి సాధిస్తుందని వీఎంఆర్‌డీఏ ప్రతినిధులు అమరావతి అధికారులకు చెప్పినట్టు సమాచారం.

ఎంఈవోలను కలిసిన ఏపీటీఎఫ్ కార్యవర్గం

అక్కయ్యపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ సీతమ్మధార మండల శాఖ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.దుర్గకుమారి, బలిరెడ్డి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు మండల విద్యాశాఖాధికారులు రామారావు, బాలామణిలను ఎన్‌జీజీఓస్ కాలనీలోని తమ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంఈవోలు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

పేట్రేగిపోతున్న రౌడీ షీటర్లు..



దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతుండడంతో భీతిల్లుతున్న ప్రజలు

గాజువాక, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతం గాజువాకలో మునుపెన్నడూ లేని విధంగా రౌడీలు, ఆకతాయిలు పేట్రేగిపోతున్నారు. అంతేకాకుండా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతూ దౌర్జన్యాలు, దాడులకు దిగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నప్పటికీ కొంతమంది మాత్రం తమ తీరును మార్చుకోవడం లేదు. పూటుగా మద్యం సేవించి బహిరంగ ప్రదేశాల్లో ఒకరిపై ఒకరు దూషించుకుంటూ ఘర్షణలకు దిగుతున్నారు. మరికొన్నిచోట్ల ప్రధాన రహదారులపై చిందు లేస్తుండడం, ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యానికి పాల్పడడం చేస్తుండడంతో ప్రజలు హడలిపోతున్నారు.

ఇటీవల గాజువాక బీసీ రోడ్డులో కొంతమంది ఆకతాయిలు పూటుగా మద్యం సేవించి అర్ధరాత్రి ఓ ఇంటి ముందు వీరంగం చేయడం.. దానిని ప్రశ్నించిన ఓ వ్యక్తిని ఇంట్లోకి ప్రవేశించి చితకబాదారు. దీంతో ఆ వ్యక్తి అపస్మారక స్థితికి చేరుకోవడంతో స్థానికులు ఆస్పత్రితో చేర్పించారు. దీనిపై గాజువాక పోలీసులకు ఫిర్యాదు అందడంతో మద్యం మత్తులో దాడికి పాల్పడిన 11 మంది ఆకతాయిలను అరెస్టు చేసి వారిపై రౌడీషీట్ తెరిచారు. అదేవిధంగా పోర్టు రోడ్డులో మూడు రోజుల క్రితం కొంతమంది రౌడీషీటర్లు తప్పతాగి పాత కక్షల నేపథ్యంలో గ్రూపులుగా విడిపోయి దారుణంగా కొట్టుకున్నారు. ఈ సంఘటనలో సంతోశ్ అనే వ్యక్తికి తీవ్ర గాయలయ్యాయి. ప్రస్తుతం సంతోశ్ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంతుతున్నాడు. ఇవేకాకుండా ఈమధ్య కాలంలో ఇటువంటి సంఘటనలు చాలా చోటుచేసుకుంటున్నాయి. వరుస సంఘటనలతో గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో శాంతిభద్రతలు క్షీణించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రౌడీలు, ఆకతాయిలను సన్మార్గంలో పెట్టే విధంగా ప్రతి పోలీస్ స్టేషన్‌లో మరింత కట్టుదిట్టంగా కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు వారి కదలికలపై నిరంతరం నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

-పి.శ్రీనివాసరావు, సౌత్ ఏసీపీ



పారిశ్రామిక ప్రాంతంలో శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే సహించేంది లేదని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సౌత్ ఏసీపీ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపేందుకు సీపీ శంఖబ్రత బాగ్చి ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తామన్నారు. రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



మాతృశ్రీ నగర్‌లో మంగళవారం రాత్రి నిర్మించిన షెడ్లు

మాతృశ్రీ నగర్‌లో రాత్రికి రాత్రే వెలసిన షెడ్లు

కూర్మన్నపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు కబ్జాదారులు వాలిపోతున్నారు... ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న స్థలాలను సొంతం చేసుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. ఈ క్రమంలో 86వ వార్డు పరిధి మాతృశ్రీ నగర్‌లో ఖాళీగా ఉన్న స్థలంలో రాత్రికి రాత్రే షెడ్లు వెలయడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూర్మన్నపాలెం సర్వే నంబర్-27లో సుమారు 2,000 చదరపు గజాలకు పైగా కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో పలువురు కబ్జాదారులు మంగళవారం రాత్రి రేకుల షెడ్లు నిర్మించి, వాటికి సున్నాలు వేయడంతో పాటు వాటికి సమీపంలోనే మరో రెండు షెడ్లు వేసేందుకు సమాయత్తమయ్యారు. ఇక్కడ ఎవరు నిర్మాణాలు చేపడుతున్నారని సంబంధిత సిబ్బందిని అడిగితే తమకు పేరు తెలియదని చెబుతున్నారు. ఈ విషయమై గాజువాక తహశీల్దార్ శ్రీనివాస్‌ను సంప్రదించగా... షెడ్ల నిర్మాణం గురించి సమాచారం అందిందని, వాటిని పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వ భూముల్లో ఎవరు నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

క్షతగాత్రుడిని పరామర్శించిన 'పల్లా'



క్షతగాత్రుని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమై ఇంటి వద్దే చికిత్స పొందుతున్న అక్కిరెడ్డిపాలేనికి చెందిన సాయి మహర్షిని మంగళవారం రాత్రి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పరామర్శించారు. సాయి మహర్షి పరిస్థితిని చూసి పల్లా ఆవేదనకు గురయ్యారు. సాయి మహర్షి ఆరోగ్యం గురించి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. సాయి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించేందుకు ప్రయత్నిస్తానని పల్లా వారికి హామీ ఇచ్చారు.

సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందజేస్తున్న గంధం శ్రీనివాసరావు

పెదగంట్యాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డులో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు కమిషనర్ కేతన్ గార్గ్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. వార్డు పరిధిలో గెడ్డల ఆధునీకరణ, సామాజిక భవనాల నిర్మాణం, శ్మశానవాటికను అభివృద్ధి చేయడం, డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించడం లేదా కవర్డ్ డంపింగ్ యార్డుగా మార్చాలని వివరించారు. అలాగే హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.పది కోట్లతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు పార్కుకు మిగిలిన వసతులను కల్పించి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని శ్రీనివాసరావు తెలిపారు.

పలు వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు



అక్కిరెడ్డిపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం పలు వార్డుల్లో టీడీపీ నాయకులు నిర్వహించారు. ఇందులో భాగంగా 69వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు అలమండ రాజు, నాయకులు ఎ.గోవిందరెడ్డి, పీవీఎస్ రాజు, గోపాలరాజు, జి.కల్యాణ్, మధులత, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: ప్రజలు మెచ్చేలా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని టీడీపీ 70వ వార్డు అధ్యక్ష, కార్యదర్శులు చట్టి గోపి, కేవీఎస్ శంకరరావు అన్నారు. వార్డు పరిధిలోని ఎల్‌వీనగర్‌లో గల పార్టీ కార్యాలయంలో సుపరిపాలనలో-తొలి అడుగు కార్యక్రమ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బూత్ ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తలు ఎవరి పోలింగ్ బూత్ పరిధిలో వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాల పంపిణీ ఎలా చేశారు, నమోదు చేసుకున్న ప్రజా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటికీ ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తుండడంతో ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, రమేశ్, పీబీఎల్ మూర్తి, పీఎంఎల్ నాయుడు, ఎస్.రాజా, తదితరులు పాల్గొన్నారు.

కాగా టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో సాయిరామ్ నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, గణపతి, రమేశ్, జగదీశ్, సుబ్బయ్య, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శివలింగం

ఘనంగా స్వయంభు లింగాల తిరుగుడి వార్షికోత్సవం

అగనంపూడి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 79వ వార్డు పరిధి పాత అగనంపూడిలో గల స్వయంభు లింగాల తిరుగుడి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాన్ని బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం నిర్వాహకులు అన్న సమారాధనను ఏర్పాటు చేశారు. బొర్రమాంబ పారాయణ సమితి ప్రతినిధులు సాయంత్రం ఆలయ ప్రాంగణంలో లలితసహస్రనామ పారాయణంతో పాటు భజన, భక్తి గీతాలను ఆలపించారు.

ఆలయ పునర్నిర్మాణానికి రామసేవా సేన ఏర్పాటు



ఆలయ నమూనా పోస్టర్ ఆవిష్కరించిన దృశ్యం

అగనంపూడి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలసలో రామాలయ పునర్నిర్మాణానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రామసేవా సేనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారీగా విరాళాలు అందించేందుకు స్థానిక యువకులు, గ్రామ పెద్దలు ముందుకువచ్చారు. విందుల వంశీ శ్రీనివాస్ రూ.10 లక్షలు, పట్టా రామఅప్పారావు రూ.2 లక్షలను విరాళంగా ప్రకటించారు. దాతల సాయంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు రామసేవా సేన కృషి చేస్తుందని ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు బలిరెడ్డి శ్రీను, బి.కన్నారావు, వి.వరహాలు, బి.ఈశ్వరరావు, డి.వెంకటరమణ, ఎం.రవి, వి.శ్రీను, ఐఆర్‌సీహెచ్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు

విజ్ఞాన్ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

అగనంపూడి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విద్యార్థుల బృందం బుధవారం స్టీల్ ప్లాంట్, మెడిటెక్ జోన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా మెడిటెక్ జోన్‌లో వివిధ ప్రోస్టేటిక్స్, ఆర్థోటిక్స్ పరికరాల తయారీ గురించి ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గామా రేడియేషన్ లేజర్ కేంద్రాలు, త్రీడీ ప్రింటింగ్ వంటి అంశాల గురించి ఈసీఈ విభాగాధిపతి ఉమామహేశ్వరి వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ అధ్యాపక బృందం కరుణ, దక్షిణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలి

ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ

అగనంపూడి. జూలై 30 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారంతో పాటు పాటు వైద్యుల సూచనలు, సలహాలను తప్పనిసరిగా పాటించాలని ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ సూచించారు. విశాఖపట్నం సౌత్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులకు ప్రొటీన్ పౌడర్, ఐరన్ టానిక్‌లను సూపరింటెండెంట్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యం కోసం రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమైనవన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు శివకుమార్‌రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమేశ్, ప్రభాకరరావు, జోగారావు, కుమార్, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ పదవీ విరమణ

మల్కాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐ డిస్పెన్సరీ, ఆస్పత్రిల్లో విశిష్టమైన వైద్య సేవలు అందించిన సూపరింటెండెంట్ బొచ్చా వెంకట రమణమూర్తి గురువా రం పదవీ విరమణ పొందనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యరంగలో ఎంతో మందికి సేవలు అందించి తృప్తి పొందానని అన్నారు. సాధరణ డాక్టర్‌గా చేరి సూపరింటెండెంట్ స్థాయికి ఎదగడం ఆనందంగా ఉన్నదని తెలిపారు. ఈఎస్ఐ ఆస్పత్రి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

గోపాలపట్నం/ పెందుర్తి/ వేపగుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల్లో భాగంగా గోపాలపట్నం, సుజాతనగర్, పురుషోత్తపురం, కృష్ణరాయపురం సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నదని జోన్-3 ఈఈ బి.సింహాచలం తెలిపారు. ఈ సదర్భంగా కొత్తపాలెం, నాగేంద్రకాలనీ, సంతోశ్‌నగర్, డీపీఆర్ నగర్, సుసర్లాకాలనీ, లక్ష్మీనగర్, ఎఫ్-బ్లాక్, సీతారామనగర్, ఏపీఎస్ఈబీ, బీ-జోన్ పార్క్, హన్మీనగర్, అలివేలు మంగాదేవి ఆలయం ఏరియా, వరహ టవర్ 1,2,3 చినముషిడివాడ గ్యాస్ గోదాం ఏరియా, జేఎన్ఎన్ఆర్ఎమ్ బ్లాక్, సత్యనారాయణపురం, గణేశ్‌నగర్, జోగులమ్మ బస్‌స్టాప్, క్రాంతినగర్, ఆక్సిజన్ కాలనీ, రైలు విహార్ ఉడా కాలనీ, గాంధీనగర్, వీరానగర్, పురుషోత్తపురం, గోకుల్ధామ్ కాలనీ, ఎన్ఏడీ కాలనీ, ఎల్‌బీనగర్, సేనాతివానిపాలెం, కృష్ణరాయపురం హౌసింగ్ బోర్డు కాలనీల ప్రజలు సహకరించాలని కోరారు.

ముగిసిన భూ పత్రాల పరిశీలన

వేపగుంట, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎంఆర్‌డీఏ భూ వివాదానికి సంబంధించి రైతులు భూ పత్రాలు పరిశీలన కార్యక్రమం బుధవారం ముగిసింది. నాలుగు రోజులుగా దరఖాస్తులను పరిశీలన చేస్తున్నట్టు డీటీ భారతి తెలియజేశారు.

స్తంభించిన ట్రాఫిక్



పెట్రోల్ బంక్ కూడలిలో ట్రాఫిక్

గోపాలపట్నం, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్థానిక బంక్ కూడలిలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ట్రాఫిక్ స్తంభించిపోయింది. గోపాలపట్నం దిగువ ప్రాంతాలకు చెందిన వారు లింకు రోడ్డుకు చేరుకోవాలంటే సుమారు 100 మీటర్ల రాంగ్‌రూట్‌లో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. బీఆర్‌టీఎస్ నిర్మాణం తరువాత ప్రధాన రహదారిలో డివైడర్‌లు ఏర్పాటు చేయడంతో దిగు ప్రాంతాల ప్రజలకు ఇదే ప్రత్యామ్నాయ రహదారిగా మారింది. గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడంతో గమ్య స్థానాలకు త్వరగా చేరుకోలేకపోతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూగర్భం నుంచే విద్యుత్ సరఫరా

నియోజకవర్గంలో రూ. 128 కోట్లతో పనులు ప్రారంభం : పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్‌శాఖలో మార్పులు తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. విదేశాల తరహాలో నగరంలో కూడా భూగర్భ విద్యుత్ లైన్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో భూగర్భ విద్యుత్ లైన్లు వేసేందుకు రూ.128 కోట్లను కేటాయించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. శ్రీహరిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద భూగర్భంలో విద్యుత్‌లైన్లు వేసేందుకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భంలో లైన్లను వేయడం ద్వారా నాణ్యమైన విద్యుత్ అందుతుందని, ఈ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. ఈ లైన్లు వేయడం ద్వారా వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు బయటకు కనపడకుండా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, విద్యుత్ సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాజువాక, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గాజువాక, గంగవరం 220 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్ల ఆధునీకరణలో భాగంగా సాంకేతిక మరమ్మతులు చేపట్టే సమయంలో అత్యవరస పరిస్థితి ఏర్పడితే నాలుగు ఉప కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1 నుంచి 14వ తేదీ వరకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాంకేతిక మరమ్మతులు చేపడతామన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ పనుల కారణంగా గాజువాక, మల్కాపురం, నేవల్ వార్ఫ్, పోర్టు ఉప కేంద్రాల్లో అంతరాయం కలిగే అవకాశం ఉందని తెలిపారు.

కార్పొరేషన్ కొళాయిల్లో మురుగు నీరు!



మల్కాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో నాలుగైదు రోజులుగా జీవీఎంసీ మంచినీటి కొళాయిల నుంచి మురు గునీరు వస్తోంది. దీంతో ఆ నీరు తాగడానికి ప్రజలు బెంబేలెత్తిపోతు న్నారు. ముఖ్యంగా ములగాడ గ్రామ ంలో ఉన్న అన్ని కొళాయిల నుంచి మురు గునీరు అధికంగా వస్తోంది. ఆ నీరు తాగి అనేక మంది వాంతులు, విరోచనాలు, జ్వరాలతో బాధపడుతున్నారు. దీంతో ప్రజలు ఈ ప్రాంతంలో ఉన్న ఆసుపత్రులకు క్యూ కడు తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్య పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వైద్యం కోసం వేచి ఉన్న బాధితులు

ఆర్‌ఓబీ పనులు పరిశీలించిన వీఎంఆర్‌డీఏ చైర్మన్



ఆర్‌ఓబీ పనులను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు తదితరులు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డులో ఎన్ఏడీ నుంచి సాకేతపురం వెళ్లే మార్గంలో కొత్తగా నిర్మించనున్న ఆర్‌ఓబీ పనులను వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ ఎమ్మెల్యే గణబాబుతో కలిసి బుధ వారం పరిశీలించారు. ఈ సందర్భగా పనుల గురించి ఇంజనీర్లను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ సెప్టెంబర్ 30కి పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణే ధ్యేయం

జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు

గోపాలపట్నం, జూలై 30(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో వనాల పెంపకం కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా పలు రకాల విత్తన బంతులను కొండవాలు, మైదాన ప్రాంతాల్లో వేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సింహాచలం రైల్వే స్టేష న్ నుంచి కొత్తవలస వరకు రైలు నుంచి విత్తన బంతు లను వేసినట్టు తెలిపారు. ఏటా వర్షాకాలంలో విత్తన బంతులను వేసి సామాజిక వనాలను అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని చేపడుతామని తెలిపారు. ఈ ఏడాది 25 వేల విత్తన విత్తనాల వేసే కార్యక్రమం చేపడుతున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు.





విత్తన బంతులను వేయడానికి వెళుతున్న జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు. (ఇన్‌సెట్లో) రైల్లో నుంచి చల్లుతున్న దృశ్యం

సినిమా గైడ్

- **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీ వెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),
- **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 36, పచ్చిమిర్చి 68, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 20, క్యారెట్ 44, దొండకాయలు 32, బంగాళదుంపలు 16, అరటికాయ (పె) 10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 66, బరబాటి40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ(పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 72, కీరదోస 30, క్యాప్సికమ్ 72, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 42, గోరుచిక్కుడు 42, దేముడుచిక్కుడు 40, కూరాపెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడి కాయలు 20, కర్రపెండలం 24, మామిడిఅల్లం 56, బూడిద గుమ్మడికాయ 20, బొప్పాయి 36, జామకాయలు(కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చికెన్ ధరలు

బ్రాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి కేవీ రామలక్ష్మి తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్య సాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మొదలైన అంశాల్లో ప్రతిభ చూపిన వారు దరఖాస్తులను ఆగస్టు 15లోగా ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. ఎంపికైన వారికి రాష్ట్రపతి చేతుల మీదుగా జనవరిలో అవార్డులను ప్రదానం చేస్తారన్నారు. ఈనెల 31 నాటికి 18 ఏళ్లు నిండని వారు మాత్రమే అర్హులన్నారు.

2, 3 తేదీల్లో జిల్లా స్థాయి చదరంగం పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అండర్-17, 19 ఓపెన్, బాలికల చదరంగం జిల్లా జట్టు ఎంపికలు ఆగస్టు 2, 3 తేదీల్లో సమతా డిగ్రీ కళాశాలలో జరుగుతాయని సంఘం కార్యదర్శి మణికంఠ రావు తెలిపారు. అండర్-19 క్రీడాకారులు జనవరి ఒకటి, 2006 లేదా ఆ తర్వాత, అండర్-17 కేటగిరీ జనవరి 1, 2008 లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు. ఆగస్టు సాయంత్రం5 గంటల్లోపు 9676636661, 9848460137 నంబర్లలో సంప్రతించాలన్నారు.

పాఠశాలకు వెళ్తూ తప్పిపోయిన బాలురు

» గాలించి పట్టుకున్న వన్‌టౌన్ సీఐ

మహారాణిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్తామని ఇంటి నుంచి బయలుదేరిన ఇద్దరు బాలురు కనిపించకుండా పోవడంతో వారి తల్లిదండ్రులు ఆందోళనతో పోలీసులను ఆశ్రయించారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులు అప్రమత్తమై వివిధ ప్రాంతాల్లో గాలించి ఆచూకీని వన్‌టౌన్‌లో కనుగొనడంతో ఊపిరి పీల్చుకున్నారు. బుక్కావీధిలో ఉంటున్న 11, 12 ఏళ్ల వయసు గల ఇద్దరు బాలురు బుధవారం స్కూలుకు బయలుదేరి అక్కడకు చేరలేదు. పాఠశాల యాజమాన్యం వారి గైర్హాజరుపై తల్లిదండ్రులను ఆరా తీయడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన వన్‌టౌన్ సీఐ జి.దేముడుబాబు బాలుర కోసం గాలించి పట్టుకుని వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

వచ్చే నెలాఖరుకు 50 శాతం ఆస్తి పన్ను వసూలు లక్ష్యం

» జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 31నాటికి 50 శాతం ఆస్తి పన్ను వసూలే లక్ష్యంగా రెవెన్యూ అధికారులు పనిచేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, డీసీఆర్ ఎస్.శ్రీనివాసరావు, అన్ని జోన్ల రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో పాటు వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులతో సమీక్షించారు. గత సమీక్షలో నిర్దేశించిన ఆస్తి పన్నుల వసూళ్లపై ఆరా తీశారు. నగరాభివృద్ధి దిశగా జీవీఎంసీ పలు కార్యక్రమాలను చేపడుతున్న నేపథ్యంలో ఆర్థిక పరిపుష్టిని మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత వారంతో పోల్చితే కొన్ని జోన్లలో రెవెన్యూ శాతం పెరిగినప్పటికీ, మరికొన్ని జోన్లలో మందకొడిగా ఉందన్నారు. ప్రతి రెవెన్యూ అధికారి వారి వసూళ్లను పెంచాలన్నారు. వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో ఇంటింటి సర్వే నిర్వహించి కొత్త, పాత బిల్డింగ్ కొలతలు సరి చూడాలని సూచించారు. తాగునీటి కనెక్షన్ ఉంటే నీటి పన్ను చెల్లిస్తున్నదీ లేనిదీ పరిశీలించాలని, ఈ ప్రక్రియ 5 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టు కేసుల స్టేటస్-కో స్టడీ చేసి కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలన్నారు. ఆస్తి పన్ను వసూలు కేంద్రాలను పెంచేందుకు ప్రతి వార్డులో ప్రజలకు అందుబాటులో ఉన్న ఒక సచివాలయాన్ని ఎంపిక చేసుకుని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. వార్డు సచివాలయాల్లో కంప్యూటర్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ఐటీ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ యూఎన్ నరసింగరావులకు సూచించారు.

గర్భిణిని బంధించి బంగారు ఆభరణాలు చోరీ!

సీతంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మహిళ సీతంపేటలోని ఓ ఇంట్లోకి చొరబడి గర్భిణిని బంధించి, ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు దోచుకుపోయింది. ఈ సంఘటన కొద్ది రోజుల కిందట జరిగినా ద్వారకా క్రైమ్ పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. బాధితురాలు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతంపేటలో మధుశ్రీ దంపతులు నివసిస్తున్నారు. ప్రస్తుతం ఆమె గర్భిణి. ఐదు రోజుల క్రితం ఎవరో ఇంటి కాలింగ్ బెల్ కొట్టడంతో మధుశ్రీ తలుపులు తీసింది. ఎవరూ కనిపించలేదు. లోపలికి తిరిగి వచ్చే సరికి గుర్తు తెలియని మహిళ అక్కడ ఉంది. మధుశ్రీ నోట్లో గుడ్డ కుక్కి, కుర్చీలో కూర్చోబెట్టి కాళ్లు, చేతులు కట్టేసింది. ఆమె ఒంటిపై ఉన్న నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలతో పరారైంది. ఇదే సమయంలో మధుశ్రీ భర్త ఫోను చేసినా తీయకపోవడంతో అనుమానం వచ్చి చూసేసరికి భార్య బంధించి ఉండడంతో ద్వారకా పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ, సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించారు. మధుశ్రీని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై వివరాలు వెల్లడించకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

హత్యా యత్నం కేసులో మరో ముగ్గురి అరెస్టు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ లారీ స్టాండ్‌లో ఈ నెల 26న జరిగిన హత్యాయత్నం కేసులో మరో ముగ్గురు నిందితులను స్టీల్‌ప్లాంట్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. దేశపాత్రునిపాలేనికి చెందిన మొల్లి సంతోష్‌కుమార్‌పై దాడిచేసిన వారిలో ఆరుగురిని సోమవారం అరెస్టు చేయగా, ఆరిశెట్టి హేమంత్‌కుమార్, జోగ దుర్గాప్రసాద్ యాదవ్, యర్రబిల్లి శ్రీనివాసరావులను బుధవారం అరెస్టు చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని సీఐ ఇ.కేశవరావు తెలిపారు.

ఏపీఐఐసీ స్థలంలోనే వినాయక ఉత్సవాలు

» కర్ర పూజ చేసిన నిర్వాహకులు » నేతల ఫ్లెక్సీలతో ప్రచారం

» 2వేల కిలోల జర్మన్ సిల్వర్‌తో విగ్రహం తయారీ



ఏపీఐఐసీ మైదానంలో వినాయక ఉత్సవాలకు కర్రపూజ చేస్తున్న నిర్వాహకులు

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీరం సమీపాన హార్బర్ పార్క్ ఏరియాలోని ఏపీఐఐసీ మైదానంలో వినాయక చవితి భారీ ఉత్సవాలకు బుధవారం కర్రపూజ నిర్వహించారు. అక్కడ సుమారు రెండు వేల కిలోల జర్మన్ సిల్వర్‌తో 20 అడుగుల ఎత్తున వినాయక విగ్రహం ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు ప్రకటించారు. అంతేకాకుండా వినాయక మండపం బయట తిరుమల తిరుపతి దేవస్థానం సెట్ వేస్తామని వివరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ఎం.ఎం.నాయుడు హాజరు అవుతారని వారి ఫొటోలతో ఫ్లెక్సీలను దారి పొడవునా ఏర్పాటు చేశారు. అయితే వారిలో ఏ ఒక్కరూ కర్రపూజ కార్యక్రమానికి హాజరు కాకపోవడం గమనార్హం.

ఏయూ కెమిస్ట్రీ ల్యాబ్ వద్ద శిలాఫలకం తొలగింపు



కెమిస్ట్రీ ల్యాబ్ వద్ద శిలాఫలకాన్ని తొలగించిన దృశ్యం

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగంలో రూ.లక్షల సీఎస్ఆర్ నిధులు వెచ్చించి దివీస్ సంస్థ ల్యాబొరేటరీను ఆధునికీకరించడంతో పాటు అవసరమైన ఖరీదైన పరికరాలను అందించింది. ఈ నెల 24న ఈ ల్యాబ్‌ను దివీస్ సంస్థ ప్రతినిధులతోపాటు ఏయూ అధికారులు ప్రారంభించారు. ఇందులో భాగంగా ల్యాబ్ ఆవరణలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. అయితే, వారం రోజులు గడిచే సరికి ఇక్కడ ఏర్పాటుచేసిన శిలాఫలకం మాయమైంది. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే తొలగించినట్టు తెలుస్తోంది. దీనిపై ప్రస్తుతం వర్సిటీలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. రూ.లక్షల నిధులతో ఆధునీకరించిన ల్యాబ్ వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని తొలగించాల్సిన అవసరం ఏమొచ్చిందని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావును వివరణ కోరగా.. శిలాఫలకంలో ముద్రించిన పేర్లలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వాటిని సరిచేసి మళ్లీ ఏర్పాటు చేయిస్తామన్నారు.

పనుల పురోగతిలో వెనుకబడితే చర్యలు

» హౌసింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశం



హౌసింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వారాంతపు లక్ష్యాలకు అనుగుణంగా ఎన్టీఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జరిగి మెరుగైన ఫలితాలు సాధించాలని హౌసింగ్ అధికారులను కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో గృహ నిర్మాణ ప్రగతిపై ఆ శాఖాధికారులు, మండల ప్రత్యేకాధికారులతో సమీక్ష నిర్వహించారు. లేఅవుట్‌ల వారీగా లక్ష్యాలను నిర్దేశించి గడువులోగా పనుల్లో పురోగతి సాధించని సిబ్బందికి మెమోలు జారీచేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. నాణ్యతలో రాజీపడొద్దన్నారు. స్పష్టం చేశారు. ప్రభుత్వం బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల సాయాన్ని అదనంగా అందిస్తున్న అంశంపై అవగాహన కల్పించాలన్నారు. కాలనీల్లో యుద్ధప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించాలన్నారు. వీజేపాలెం, మామిడిలోవ లేఅవుట్‌లలో సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, హౌసింగ్ పీడీ సీహెచ్ సత్తిబాబు, ఈఈలు శ్రీనివాసరావు, సూరిబాబు, ఇతర శాఖల అధికారులు జ్ఞానవేణి, కేవీఎస్. చౌదరి, సత్యపద్మ తదితరులు పాల్గొన్నారు

ట్రాలర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి



రాహుల్ (ఫైల్ ఫొటో)

కూర్మన్నపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ట్రాలర్ ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కణితి కాలనీకి చెందిన బి.రాహుల్ (28) సినర్జీస్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధులు పూర్తిచేసుకొని బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా దువ్వాడ రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న గుంతలు తప్పించే క్రమంలో అదుపుతప్పి పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ట్రాలర్ ఢీ కొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ట్రాలర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చినవాల్తేరులో వ్యక్తి ఆత్మహత్య

మద్దిలపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చినవాల్తేరు చాకలివీధికి చెందిన సిడగం లక్ష్మణరావు (31) మద్యానికి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. కొద్దిరోజులుగా ఇంట్లోనే ఉండడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.